తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గరుడ వాహనంపై వేదనారాయణ స్వామి విహారం



నాగలాపురం, మే 30 ప్రభాతవార్త: కంచిలోని శ్రీ వరదరాజస్వామి ఆలయంలో నిర్వహించే గరుడసేవ ఉత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాగలాపురంలోని శ్రీ వేద నారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేద నారాయణస్వామివారికి వైభవంగా గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణలతో సుందరంగా అలంకరించి గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అధికారులు, అర్చకులు ఉత్సవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## రైల్వేస్టేషన్, బస్టాండ్ పార్సల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు



తిరుపతి, మే 30 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు వినియోగంపై తిరుపతి జిల్లా పోలీస్ శాఖ "జీరో టాలరెన్స్" విధానాన్ని అమలు చేస్తోంది. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తోంది. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. జిల్లా ఈగల్ టీమ్ ఇన్స్పెక్టర్ డి. నాగార్జున రెడ్డి సిబ్బంది శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్సల్ కార్యాలయాల్లో నార్కోటిక్ డాగ్స్ సహాయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వస్తువులు, పార్సిళ్లు, సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు.

### విచారణకు హాజరైన
## పూడి శ్రీహరి



కుప్పం, మే 30 ప్రభాతవార్త

మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ సిపిఆర్ఓ, వైకాపా ప్రధాన కార్యదర్శి (మీడియా) పూడి శ్రీహరి శనివారం కుప్పంలో పోలీసుల విచారణ నిమిత్తం హాజరయ్యారు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఆయన కుప్పం అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడుపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని తెదేపా నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో పూడి శ్రీహరిపై కుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆపై కోర్టు గతనెల 30న బెయిల్ మంజూరు చేసింది. అయితే పూడి శ్రీహరికి 35సి(3)బిఎన్ఎస్ కింద నోటీసులు జారీ చేయాలని సైతం కోర్టు ఆదేశించింది. ఈసెక్షన్ ప్రకారం విచారణకు పోలీసులు ఎప్పుడు హాజరు కావాలన్నా వచ్చి విచారణకు సహకరించాల్సి ఉంటుంది. దీంతో పూడి శ్రీహరి శనివారం కుప్పం పోలీస్‌స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. కుప్పం డిఎస్పీ పార్థసారథి, సిఐ మల్లేష్ యాదవ్‌లు కేసు విషయంగా పూడి శ్రీహరిని విచారించినట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో పూడి శ్రీహరి పోలీస్‌స్టేషన్‌నుంచి బయటకు వచ్చారు.

# పొగాకుతో క్యాన్సర్ ముప్పు

### ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో డిఎంహెచ్ఓ

చిత్తూరు, మే 30 ప్రభాతవార్త: పొగాకు వ్యసనంతో క్యాన్సర్ ముప్పు వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డిఎంహెచ్ఓ డాక్టర్ నాగ శశిభూషణ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు రూరల్ మండల పరిధిలోని ఎన్ఆర్ పేట పిహెచ్‌సి ఆవరణలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవంకు సంబంధించి ఈ ఏడాది నినాదం పొగాకు ఆకర్షణలకు దూరంగా వుందాం! నికోటిన్, పొగాకు వ్యసనాలను ఆరికడుదాం! అన్నారు. పొగాకు తాగడం వల్ల భయంకరమైన అనేక వ్యాధులు వస్తాయని, సిగరెట్, బీడీ, చుట్ట ద్వారా వచ్చే పొగ పీల్చే వారికి సైతం కాన్సర్ ముప్పు వస్తుందన్నారు. పొగాకు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల కాన్సర్, నోటి కాన్సర్, లివర్ కాన్సర్, బ్లడ్ క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయన్నారు. పొగాకు వల్ల వచ్చే వ్యాధులు శరీరంలో వెంట్రుకలు, గోర్లు మినహాయించి మిగిలిన శరీరంలోని ఏ భాగానికైనా రావచ్చునన్నారు. ప్రజలు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, డిఎంఓ డాక్టర్ నవీన్‌తేజ్ రాయల్, డిఎస్ఓ అనిల్‌కుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, ఎఎన్ఎంలు, ఇతర అధికారులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్‌పేటలో అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో డిఎంహెచ్ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి.

## గోవిందరాజుని
# దివ్యరథోత్సవం

తిరుపతి, మే 30 ప్రభాతవార్త:



తిరుపతిలో గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలతో తిరువీధులు మార్మోగగా, వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారికి మంగళారతులు అర్పించారు. ఆత్మజ్ఞానాన్ని బోధించే మహత్తర తాత్త్విక సందేశం. ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనసును పగ్గంగా, ఇంద్రియాలను గుర్రాలుగా, విషయాలను వీధులుగా భావించడం ద్వారా ఆత్మ-అనాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది. రథోత్సవంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడిబోర్డు సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసు అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

**-నేడు కపిలతీర్థంలోచక్రస్నానం**

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరగా నేడు ఆదివారం ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు కపిలతీర్థం (ఆళ్వార్ తీర్థం)లో చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు.

### హత్యాయత్నం కేసులో
## నలుగురికి రిమాండ్



పుత్తూరు, మే 30 ప్రభాతవార్త : ఈ నెల 28వ తేదీ మునిసిపాలిటీ పరిధిలోని చినరాజుకుప్పం సమీపంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ప్రసాద్‌నాయుడుపై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు శనివారం చినరాజుకుప్పం దళితవాడకు చెందిన పుత్తూరు రాజేంద్ర (38), పుత్తూరు రవి (36), పుత్తూరు సంతోష్ (20), పుత్తూరు నరేష్ (39)లను హత్యాయత్నం నేరంపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. గ్రామానికి చెందిన చెంగల్రాయలుకు అదే గ్రామానికి చెందిన పుత్తూరు రాజేంద్రకు పాత గొడవలున్నాయి. ప్రసాద్‌నాయుడు చెంగల్రాయులకు మద్దతు ఇస్తూ తమను వేధిస్తున్నాడని, అతనిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పుత్తూరు రాజేంద్ర తదితరులు పథకం ప్రకారం 28వ తేదీ ఉదయం వాకింగ్ ముగించుకుని ఇంటికి వెళుతున్న ప్రసాద్‌నాయుడు ద్విచక్ర వాహనాన్ని ఆటోతో ఢీకొట్టారు. అతను కింద పడగానే రాజేంద్ర కత్తితో నరకడానికి ప్రయత్నించగా చేతులు అడ్డుపెట్టుకోవడంతో కుడి చేతికి తీవ్ర గాయాలు, ఎడమ చేయి ఉంగరపు వేలులో కొంత భాగం తెగిపోయాయి. మిగిలిన ముగ్గురు ప్రసాద్ పైకి లేవకుండా చేతులతో, కాళ్లతో కొట్టారు. ఈ నెల 29వ తేదీ రాత్రి వడమాలపేట మండలం అబ్బికండ్రిగలో వీరిని అరెస్ట్ చేసినట్టు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ బి.వెంకటలక్ష్మి తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఎస్.నాగేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య - మృతురాలి బంధువుల ధర్నా



తవణంపల్లె, మే 30 ప్రభాతవార్త: ప్రేమ విఫలమై యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అరగొండ గ్రామ పంచాయతీ చారాల దళితవాడలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని అరగొండ గ్రామపంచాయతీ చారాల దళితవాడకు చెందిన రమేష్ చిన్న కుమార్తె కె.కావ్య(18) అనే యువతి అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమిస్తోంది. అయితే తన ప్రేమను ఆ యువకుడు తిరస్కరించడంతో మనస్తాపంతో కావ్య శనివారం ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే బంధువులు అరగొండ అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు.

**మృతురాలి బంధువుల ధర్నా రాస్తారోకో**

ప్రేమ విఫలమై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువతి సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించడంలో స్తానిక పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై మృతురాలి బంధువులు అరగొండ అపోలో ఆస్పత్రి ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆస్పత్రి వర్గాలు ఎంఎల్‌సి కేసుగా పరిగణిస్తూ తదుపరి చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఉదయం సమాచారం అందించడంతో పాటు జరిగిన సంఘటనపై మధ్యాహ్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. అయినప్పటికి పోలీసులు ఈసంఘటనపై సాయంత్రం 6 గంటల వరకు కేసు నమోదు చేయడం కానీ, మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించడం కాని చేపట్టపోవడంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ మృతురాలి బంధువులు ఆ స్పత్రి ఎదుట భైఠాయించి ధర్నా రాస్తారోకోకు పూనుకున్నారు. దీనితో సుమారు 30 నిమిషాల పాటు వాహనాల రాకపోకలు స్థంభించి పోయాయి. ఎట్టకేలకు సాయంత్రం 6.30 గంటలకు పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు చర్యలు చేపట్టడంతో వారు ఆందోళన విరమించారు.

## పోలీసు జిమ్ ప్రారంభించిన ఎస్పీ




చిత్తూరు, మే 30 ప్రభాతవార్త: జిల్లా సాయుధదళం కార్యాలయంలో పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వం, ఆరోగ్య పరిరక్షణ, విధుల నిర్వహణ మరింత సమర్థత సాధించడానికి ఆధునిక సదుపాయాలతో నవీకరించిన పోలీస్ జిమ్‌ను శనివారం ఎస్పీ తుషార్ డూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్‌లో ఏర్పాటు చేసిన నూతన వ్యాయామ పరికరాలను పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడి పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో పోలీసులకు శారీరక సామర్థ్యం, మానసిక స్థైర్యం ఎంతో అవసరమని అందుకోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ముఖ్యమన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల పోలీసు సిబ్బంది జిమ్‌లో వున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలన్నారు. ఫిట్‌నెస్ అనేది కేవలం విధి నిర్వహణకే కాకుండా వ్యక్తిగత జీవితంలో సైతం ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో నాన్ కేడర్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ దేవదాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ మురళీమోహన్, ఆర్ఐలు చంద్రశేఖర్, సుధాకర్, వీరేష్‌లు, పోలీస్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో దగ్ధమైన లారీ



బైరెడ్డిపల్లి మే 30 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండలం బురిశెట్టిపల్లి సమీపంలోని జాతీయ రహదారి నాలుగు మలుపు వద్ద వినాయక ట్రావెల్స్ సంబంధించిన లారీ అగ్ని ప్రమాదానికి గురైనది కుప్పం నుండి తాడిపత్రి వెళ్తున్న ఈ లారీ స్టీల్ పౌడర్ తీసుకెళ్తుండగా ఉన్నట్టుండి మంటలు చెల రేగడంతో డ్రైవర్ నీళ్ల కోసం కిందకు దిగి పరుగులు తీశాడు. ఇంతలో అగ్గి కాస్త ఎక్కువై ముందర క్యాబిన్ కాలిపోయింది. లారీ ఓనర్ ఫిర్యాదు మేరకు పలమనేరు ఫైర్ స్టేషన్ నుండి హెడ్ కానిస్టేబుల్ సుమన్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడం జరిగినది ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది మాట్లాడుతూ తమకు ఆలస్యంగా ఫిర్యాదు అందిందని ఎవరైనా ఒకరు తమకు కాల్ చేసి ఉంటే లారీని కాపాడేవారుమని ఇంచుమించు 25 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నదని ఆయన తెలియజేశారు.

# బంధువు ఇంట్లోనే చోరీ -యువకుడు అరెస్ట్

### -రూ.28.16 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



తిరుపతి,మే 30ప్రభాతవార్త: తిరుపతి నగరంలో సంచలనం రేపిన ఇంటి చోరీ కేసును క్రైమ్ పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. చోరీకి గురైన 28,16,000 లక్షలు విలువైన 177.6 గ్రాముల బంగారు ఆభరణాలను పూర్తిగా రికవరీ చేయడంతో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్, ఇంటి తాళం చెవి, స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి చెన్నారెడ్డి కాలనీకి చెందిన అన్యం పృథ్వీ (20) తనపై ఉన్న కుటుంబ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని సొంత పెద్దమ్మ ఇంటినే లక్ష్యంగా ఎంచుకుని చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసును తీవ్రంగా తీసుకున్న జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఏ. శ్రీనివాసులు , సీఐ శ్రీ ఎన్. శివకుమార్ రెడ్డి పర్యవేక్షణలో తిరుపతి క్రైమ్ పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఈ నెల 28వ తేదీ ఇంటి యజమానులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన విషయాన్ని గమనించిన నిందితుడు, ముందుగానే తన వద్ద ఉన్న తాళం చెవితో ఇంటిలోకి ప్రవేశించాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోని బీరువా సేఫ్‌ను స్క్రూడ్రైవర్ సహా యంతో బలవంతంగా తెరిచి అందులో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించాడు. అనంతరం ఎవరూ అనుమానించకుండా కుటుంబ సభ్యులతో సాధారణంగా వ్యవహరిస్తూ తనపై అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు. అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలపై విచారణ చేపట్టగా పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అదుపులోకి తీసుకుని విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. మద్యం సేవించడం, ధూమపానం వంటి వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఈ చోరీకి పాల్పడినట్లు వెల్లడించాడు. లాకర్లు, సురక్షిత ప్రదేశాలలో విలువైన బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు భద్రపరచుకోవాలని పోలీసులు

### నేచర్ ఇండెక్స్ 2026 ర్యాంకింగ్స్‌లో
## ఎస్వీయూకు ప్రతిష్టాత్మక స్థానం

తిరుపతి విద్య, మే 30 ప్రభాతవార్త


యస్వీయూ నేచర్ ఇండెక్స్ 2026 ర్యాంకింగ్స్‌లో విశిష్ట స్థానం సాధించింది. 2025 ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు కాలానికి సంబంధించిన తాజా ర్యాంకింగ్స్‌లో యస్వీయూ భారతదేశ స్థాయిలో ఓవరాల్ విభాగంలో 234వ స్థానం, అకాడమిక్ సంస్థల విభాగంలో 183వ స్థానం పొందింది. అలాగే ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగంలో దేశవ్యాప్తంగా 34వ స్థానం సాధించింది. వాతావరణ శాస్త్రం, పర్యావరణ అధ్యయనాలు, అంతరిక్ష విజ్ఞానం రంగాల్లో విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పరిశోధనలకు ఈ గుర్తింపు దక్కినట్లు అధికారులు తెలిపారు. విశ్వవిద్యాలయం, జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రం శాస్త్రవేత్తలు సంయుక్తంగా నిర్వహించిన ఒక పరిశోధన ఈ ఘనతలో కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ నేచర్ ఇండెక్స్‌లో స్థానం సాధించడం విశ్వవిద్యాలయ పరిశోధనా ప్రతిభకు నిదర్శనమన్నారు.



అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని చెప్పారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు మరింత ఊతమిస్తూ ఆధునిక పరిశోధనా వసతులు, అంతరశాఖ సహకారాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను విస్తరించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని తెలిపారు. రెక్టార్ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ నేచర్ ఇండెక్స్ గుర్తింపు విశ్వవిద్యాలయంలో నెలకొన్న శక్తివంతమైన పరిశోధనా సంస్కృతికి నిదర్శనమన్నారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను ప్రోత్సహించడంలో యూనివర్సిటీ ఎప్పుడూ ముందంజలో ఉంటోందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ నేచర్ ఇండెక్స్‌లో విశ్వవిద్యాలయం సాధించిన గుర్తింపు యస్వీయూకే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధనల నాణ్యత ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నదనడానికి ఇది నిదర్శనమని చెప్పారు. ఏడు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యా ప్రమాణాలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, పరిశోధన, సమాజాభివృద్ధి రంగాలలో విశిష్ట సేవలను కొనసాగిస్తోంది. నేచర్ ఇండెక్స్ 2026లో లభించిన ఈ గుర్తింపు విశ్వవిద్యాలయాన్ని దేశంలోని ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయాల సరసన నిలబెట్టిందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

## సమాచార శాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నిషియన్ సేవలు మరువలేనివి

చిత్తూరుహెల్త్, మే 30 ప్రభాతవార్త:



సమాచార శాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నిషియన్‌గా ఎం.వెంకటరత్నం సేవలు మరువలేనివని పౌరసమాచార సంబంధాల శాఖ డిప్యుటీడైరెక్టర్ వేలాయుధం అన్నారు. పౌర సమాచార సంబంధాల శాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నిషియన్‌గా విధులు న్విహించిన ఎం.వెంకటరత్నం శనివారం పదవి విరమణ చెందారు. కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయ సమావేశభవనంలో జరిగిన పదవి విరమణ సభలో డిప్యుటీ డైరెక్టర్ వేలాయుధం మాట్లాడుతూ వెంకటరత్నం తన పదవికాలంలో క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించి శాఖ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వెంకటరత్నంను శాఖలో విధులు నిర్వహిస్తున్న సహ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిపిఆర్ఓ గురుస్వామిశెట్టి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవరదరాజస్వామి గరుడవాహనసేవ

కుప్పం, మే 30 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడవాహన సేవను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి గరుడవాహనంపై అధిరోహింపజేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారి గరుడోత్సవం కొనసాగింది. భక్తులు స్వామివారికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అలాగే గుడుపల్లె మండలం కనమనపల్లిలో వెలసిన శ్రీ శ్రీనివాసస్వామికి సైతం గరుడోత్సవం జరిపారు.

## కార్యదర్శి భాస్కర్ సేవలు ప్రశంసనీయం

కుప్పం, మే 30 ప్రభాతవార్త



కుప్పం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన బహదూర్ భాస్కర్ సేవలు ప్రశంసనీయమని తహశీల్దార్ చిట్టిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం భాస్కర్ పదవీ విరమణ సందర్భంగా స్థానిక మండల కార్యాలయంలో భాస్కర్ దంపతులను పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో భాస్కర్ ప్రజల మన్ననలు పొందారని ఆయన తదుపరి శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంకు సిఎం చంద్రబాబు పెద్దపీట

– టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్

కుప్పం, మే 30 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యంకు సిఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిట్టపల్లిలో సంజీవని ప్రాజెక్టుపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో ప్రజల ఆరోగ్య వివరాలు డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు అత్యవసర వేళల్లో వారికి నిపుణులైన వైద్యులచే చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రితో పాటు అన్ని పిహెచ్‌సి కేంద్రాల్లోను ఈ ప్రాజెక్టు అమలులో ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనీసవేతనాల బోర్డుసభ్యుడు శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, నేతలు లీలావెంకటేష్, చలపతి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, ఫయాజ్, మంజునాథ్, కో క్లస్టర్ గాయత్రి, రెస్కో డైరెక్టర్ హరోగరన్, బాలు, కనకరాజు, చంద్రశేఖర్, గణేష్, వైద్య బృందం పాల్గొన్నారు.

## ఆపరేషన్ క్లీన్‌స్వీప్‌కు ప్రజలు సహకరించాలి: కమిషనర్

కుప్పం, మే 30 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీని స్వచ్ఛంగా ఉంచేందుకు చేపడుతున్న ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమంకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు కోరారు. శనివారం కుప్పం పట్టణంలో పలుచోట్ల కమీషనర్ దగ్గరుండి కాలువలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పాన్ని స్వచ్ఛకుప్పంగా మార్చేందుకు ప్రజలు సహకారంఅందించాలన్నారు. చెత్తనురోడ్లపైపడేయకుండా ఇ –ఆటోలకు అందించి సహకరించాలని కోరారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

శాంతిపురం, మే 30 ప్రభాతవార్త



మండలంలో మంచినీటి సమస్య పరిష్కారంకు చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ ఎపిఆర్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కర్లగట్ట పంచాయతీ తంబిగాని పల్లి, గుంజార్ల పలిల పంచాయతీ చింతకంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. తంబిగాని పల్లిలో కొత్త బోరు మోటారు, చింతకంపల్లిలో కొత్తబోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు స్థానిక రైతుల బోర్లలో టైఅప్ ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. నీటి ఎద్దడి అధికంగా ఉన్న సి.బండపల్లి, బేవనపల్లి గ్రామాల్లో ట్యాంకరుతో నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కొలమడుగు పంచాయతీ అమ్మవారిపేటలో 650మీటర్ల కేబుల్ తీగలు దొంగిలించారన్నారు. అలాగే కారుమట్లలో సైతం ఇలాగే చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు అశ్వత్ నారాయణ, ఆదర్శకుమార్, స్థానిక నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ పిఎ ఆస్తులు వందల కోట్లు

– తెలుగుదేశం నాయకులు ఆరోపణ

చిత్తూరుహెల్త్, మే 30 ప్రభాతవార్త:



మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిఏగా పని చేసిన కెఎన్ఆర్ ఆస్తులు వందల కోట్ల రూపాయలు వుంటే లిక్కర్ స్కామ్‌లో మాజీ సిఎం వైఎస్ జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి ఏ మేరకు ఆదాయం వచ్చి వుంటోందో ఊహించుకోవాలని తెలుగుదేశం నాయకులు మోహన్‌రాజ్, యువరాజు, సప్తగిరి ప్రసాద్‌లు ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనం కల్గించిన జగన్ పిఎ కె.నాగేశ్వరరెడ్డి అలియాస్ కెఎన్ఆర్ వందల కోట్ల రూపాయలు తన పేరుపై, తన భార్య పేరుపై సంపాదించారని, ఒక సాధారణ జర్నలిస్టుగా వున్న కెఎన్ఆర్ వందల కోట్ల రూపాయలు తన పేరు మీద, తన భార్య పేరు మీద సంపాదించారన్నారు. మాజీ సిఎం జగన్ పిఎగా వుండి వందల కోట్ల రూపాయలను లిక్కర్ స్కాంలో సంపాదించాడని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో మాజీ సిఎం వైఎస్ జగన్‌తో పాటు సజ్జల అరెస్టు తథ్యమన్నారు.

## శుభ్రంగా డ్రైనేజీలు

– మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు, మే 30 ప్రభాతవార్త:




నగర పరిధిలోని డ్రైనేజీ కాలువలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని, మురుగునీటి ప్రవాహానికి అనుగుణంగా వ్యర్థాలు, పూడిక మట్టి తొలగించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ రెండవ వారం కార్యక్రమాల్లో భాగంగా శనివారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డ్రైనేజీ కాలువల శుభ్రం చేసే కార్యక్రమంను చేపట్టారు. వెంగళరావు కాలనీలో శనివారం ఉదయం మేజర్ మురికి కాలువను శుభ్రం చేసే పనులు ప్రారంభించి, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాలపై ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమీషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా నగరంలో నాలుగు వారాల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి వారం అపరిశుభ్రంగా వున్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడం జరిగిందని, రెండవ వారం కాలువల శుభ్రత పనులు చేపట్టనున్నట్లు వివరించారు. అన్ని డివిజన్ల పరిధిలోని స్థానిక పార్టీల నాయకులు, స్వయం సహాయక సంఘాల సమహిళలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కాలువల శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, కూటమి పార్టీ నాయకులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్లలో ప్లాట్ల రాళ్ళు తొలగింపు

చిత్తూరుహెల్త్, మే 30 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనధికార లేఅవుట్లలో ప్లాట్లకు సంబంధించిన రాళ్ళను తొలగిస్తున్నట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు నాగేంద్ర, సుభప్రభలు తెలిపారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం ఇందిరానగర్ ప్రాంతంలో అనధికార లే అవుట్లను టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. అయితే అత్యధిక మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఇలాంటి అనధికార లేఅవుట్లలో వేసిన ప్లాట్లను గుర్తించి రాళ్ళను తొలగిస్తామన్నారు. నగర పాలక పరిధిలో అనధికార లేఅవుట్‌లో ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అక్కమ్మ తల్లి తిరునాళ్ళు

గుడిపాల, మే 30 ప్రభాతవార్త:




మండల పరిధిలోని రామభద్రాపురం గ్రామంలో శనివారం గ్రామ దేవత అక్కమ్మ తల్లి తిరునాళ్ళు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, వీరుపాక్షమ్మ దగ్గర పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించి మేళ తాళాలు, బాణసంచా మధ్య శనివారం రాత్రి ఉత్సవమూర్తులు, అమ్మవారి గెరికలను జోడించి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పొంగళ్ళు పెట్టి భక్తిశ్రద్ధలతో భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం వసంతోత్సవంలో పిల్లలు, పెద్దలు తేడా లేకుండా ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిజెఎం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు, ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్, మాజీ సర్పంచ్ ఎడ్లురి అమరేంద్రబాబు, గోళ్ళ వరదరాజులు, గోళ్ళ సురేంద్రబాబు, మెడికొండల ధనంజయనాయుడు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన మండల 'దేశం' అధ్యక్షులు

గుడిపాల, మే 30 ప్రభాతవార్త:

తెలుగుదేశం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మండల తెలుగుదేశం



పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేష్ తమిళనాడు రాష్ట్రం శోలింగర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంకు స్వామి దర్శనం నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుతో కలిసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారుల విజయం కోసం ప్రతి ఒక్క నాయకుడు శ్రమించి పని చేయాలన్నారు. మంత్రి నారాలోకేష్‌ను కలిసిన వారిలో తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు తదితరులు వున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఏనుగులు పంటలపైకి చొరబడకుండా చర్యలు చేపడతాం

పి కె ఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

రామకుప్పం, మే 30 ప్రభాతవార్త



మండలంలోని కౌండిన్య అభయారణ్య ప్రాంతంలో రైతుల పండిస్తున్న పంటలపై ఏనుగులు చొరబడకుండా చర్యలు తీసుకుంటామని పి కె ఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం ననియాల అటవీ సమీప ప్రాంతాల్లో ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ననియాల తాండ, రామాపురం తండా, పంద్యాల మడుగు, జీడిమాకులపల్లి తదితర గ్రామాల్లో అరటి ,మామిడి, వరి, రాగి తదితర పంటలను నిత్యం ఏనుగుల దాడులతో రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం ఎప్పటికప్పుడు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ననియాలలో తొమ్మిది కిలోమీటర్ల మేర సోలార్ కంచె మరమ్మతులకు ప్రతిపాదనను ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఏనుగుల సంచారంతో గ్రామ సరిహద్దుల్లోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు అటవీ సిబ్బంది సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టర్ రేంజర్ జయశంకర్, నేతలు గజేంద్ర, లోకేష్, బాబు, వేణు, గంగాధరం, త్యాగరాజు, సామూనాయక్ తదితరులు పాల్గొన్నారు.


## నక్కనపల్లిలో పౌరహక్కుల దినం

వి.కోట, మే 30 ప్రభాతవార్త:



మండలంలోని జవునిపల్లి గ్రామపంచాయతీ కోట నక్కనపల్లి గ్రామంలోని దళితవాడలో పేరుకుపోయిన పలు రకాల సమస్యలపై ఈరోజు జరిగిన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీర్ఘకాలంగా దళితవాడలోని నీటి సరఫరా ట్యాంకు శుభ్రం చేయలేదని నీళ్లలో పాచి పురుగులు వస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక దళితులు వాపోయారు. దళితవాడలోని మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం వస్తున్న స్థానిక సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని అధికారులు దృష్టికి తీసుకుపోయారు. స్థానికంగా అందుబాటులో ఉండాల్సిన ఆశా వర్కర్ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నదని స్థానికులు తాసిల్దారికి తెలియజేశారు. దళితులకు ఉన్న స్మశాన వాటికకు దారి లేకపోవడం శోచనీయమని ఈ సమస్య పరిష్కారానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు చొరవ చూపలేదని స్థానిక దళితులు మండిపడ్డారు. ఈ సమస్యలను వారం లోపు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్థానిక తాసిల్దార్ ఉదయ్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్, ఆర్ ఐ మోహన్ రెడ్డి, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## తీవ్ర మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య




వి.కోట, మే 30 ప్రభాతవార్త:

మండలంలోని కోట నక్కనపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన శీనప్ప 70 అను వ్యక్తి చెరువు సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి కుటుంబీకులకు తెలిపారు. కుటుంబంలో జరిగిన వివాదాల కారణంగా మనస్థాపానికి గురై మృతుడు శీనప్ప ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్నికి చేరుకుని వృద్ధుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వి.కోట సిఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు.

## టెట్ మినహాయింపుపై పార్లమెంటులో చట్ట సవరణ

– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్


చిత్తూరు, మే 30 ప్రభాతవార్త:



ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష మినహాయింపు కోసం పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు శుక్రవారం వెలువరించిన తీర్పు ప్రకారం ఇన్ సర్వీసు టీచర్లు మూడు సంవత్సరాల్లోపు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మినహాయింపుకు ఇచ్చిన హామీని విస్మరించిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఉపాధ్యాయుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని, టెట్ ఉత్తీర్ణత లేని వారికి ఇక పదోన్నతులు లభించవని ఆవేదన వెలిబుచ్చారు. పిల్లలకు పాఠాలు చెప్పాలా! టెట్ పరీక్షకు సిద్ధం అవ్వాలా! అన్న సందిగ్ధంలో ఉపాధ్యాయులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పార్లమెంటులో చట్ట సవరణ చేయడానికి చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వంను ఆయన డిమాండ్ చేశారు.

## పోలీసులపై విశ్వాసం పెరిగేలా విధులు

– డిఎస్పీ వెంకట నారాయణ



చిత్తూరు, మే 30 ప్రభాతవార్త:

పోలీసులపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా విధుల నిర్వర్తించాలని చిత్తూరు డీఎస్పీ వెంకట నారాయణ పేర్కొన్నారు. చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ శనివారం రొంపిచెర్ల, కల్లూరు పోలీస్ స్టేషన్లలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ వెంకటనారాయణ పోలీస్ స్టేషన్లలో పరిసరాలతో పాటు పలు రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో డిఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో గౌరవంగా మెలగాలని, సిసి కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలని, అనుమానస్పద వ్యక్తులపై నిఘా వుంచాలన్నారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాలతో పాటు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, రొంపిచెర్ల ఎస్ఐ మధుసూధన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రభుత్వ స్కూళ్లలో చేరికలపై సమీక్షా సమావేశం


శాంతిపురం, మే 30 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సంబంధించి అన్ని ప్రైమరీ, యుపి, హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ఎంఇఒలు సెల్వపాండియన్, చంద్రమ్మ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించవచారు. ఐదేళ్లపైబడిన పిల్లలను, డ్రాపౌట్లను పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు తల్లిదం డ్రులకు వివరించాలన్నారు. మండలంలో ఐదేళ్ల పైబడ్డ పిల్లలు 751మంది ఉండగా ఇప్పటివరకు 718మంది నమోదయ్యారన్నారు. వీరిలో ప్రభుత్వ బడుల్లో 460, ప్రైవేట్‌లో 258మంది చేరగా 33మంది నమోదు కావాల్సి ఉందన్నారు. ప్రతి బిడ్డ బడిలోకి నాణ్యమైన విద అందరికీ అనే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టాలన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన సిఆర్ మోహన్

కుప్పం, మే 30 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడును ఎపి,తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల ఎల్ఐసి ఫుల్‌టైమ్ టెంపరరీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సిఆర్ మోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన ఎల్ఐసిలో 1985-1991మధ్య క్లాస్3,4 కేడర్లలో పనిచేస్తూ తొలగించబడ్డ ఉద్యోగుల నియామకాలు చేపట్టేలా కృషి చేయాలని సిఎం చంద్రబాబును కోరారు. వందలాది కుటుంబాలు గత పదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని సుమారు 85శాతం మంది ఆర్థిక ప్రయోజనాలు పొందాల్సిన వారు ఉన్నారన్నారు. ఎల్ఐసిలో క్లాస్3,4 కేడర్‌లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇవి భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సిఎంను కోరారు.

## ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

పలమనేరు, మే 30 ప్రభాతవార్త:



ప్రభుత్వ భూముల కబ్జాలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ పలమనేరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం సిపిఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ బైరెడ్డిపల్లె మండల పరిధిలో కొంత మంది వంకపోరంబోకులు, కాలువ భూములు, శ్మశాన భూములు దౌర్జన్యంగా ఆక్రమించుకొని దర్జాగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఏళ్ళ తరబడి ఈ కబ్జాలు కొనసాగుతున్నా బైరెడ్డిపల్లె రెవిన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో వర్షాలు పడితే నీటి ప్రవాహాలు గ్రామాల మీదకు వచ్చి ఆస్థి నష్టం, ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు అరికట్టాలని, కబ్జాదారులపై కఠిన చర్యలు గైకొనాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ భవానికి వినతిపత్రం అందజేశారు. సిపిఐ పలమనేరు నియోజకవర్గం కార్యదర్శి చెన్నకేశవులు, పట్టణ కార్యదర్శి బుర్ర మంజునాథ్, గంగవరం మండల సిపిఐ నాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం వాయిదా

పలమనేరు, మే 30 ప్రభాతవార్త:



పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. సాయంత్రం జరగాల్సిన సమావేశం కొందరు అధికారు లు రాక పోవడంతో రాత్రి 9 గంటల వరకు వేచి చూశారు. ఐతే ఆర్డీఓ భవాని, సిఐ మోహన్‌రెడ్డి, పలువురు ఎమ్మార్వోలు, ఎంపిడిఓలు మాత్రమే హాజరయ్యారు. ఐతే వివిధ శాఖలకు చెందిన కొందరు అధికారులు దుమ్మా కొట్టడంతో ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎన్నో సమస్యలు చర్చించాల్సి వున్నా కొందరు గైర్హాజరు కావడం దురదృష్టకరమన్నారు. మరోసారి సమావేశానికి తేదీ నిర్ణయిస్తామని నిర్దేశించిన మేరకు అందరూ తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

## పొగాకు వ్యతిరేకత అవగాహన సదస్సు

బైరెడ్డిపల్లి, మే 30 ప్రభాతవార్త




ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు """పొగాకు ఆకర్షణలకు దూరంగా ఉందాం బలమైన సంకల్పం తీసుకుందాం పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం""" అంటూ ప్రతిజ్ఞ , ర్యాలీ చేసి పొగాకు పట్ల డాక్టర్ విజయ్‌చందర్ డాక్టర్ శాలిని అవగాహన కల్పి చారు. పొగ త్రాగడం,పొగాకు ఉత్పత్తులు సేవించడం వలన టిబి, క్యాన్సర్, బిపి షుగర్, గుండె జబ్బులు శారీరక మానసిక సమస్యలు మరెన్నో దీర్ఘకాలిక వ్యాధులువచ్చును అన్నారు. పి సావిత్రి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకే షన్ ఆఫీసర్ అవగాహన కల్పిస్తూ పిల్లలు, యువకులు సిగరెట్,గుట్కా , ఖైని, పాన్ పరాగ్ ,ఇతర నికోటిన్ ఉత్పత్తులు వాడుతూ దేశ భవితకు దారి దీపాలు లాంటిబాలలు ,యువత ఏదో ఒక రూపంలో అలవాటు పడి వ్యసనపరులగుతూ ప్రాణాలు కోల్పోతున్నారు యువత మంచి అలవాట్లతో ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు ఆలోచనలతోజీవితాన్ని సమాజాన్ని నిర్మించాలని తెలిపారు ఈ సి హెచ్ జయంతి, సూపర్ వైజర్ లు మాధవ్ కుమార్ ,రెడ్డెమ్మా,, ఏఎన్ఎంలు ,ఆశలు పాల్గొన్నారు .

## సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, మే 30 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వా మివారి దేవస్థానంలో అమలవు తున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు కాణిపాకం గ్రామపంచాయతీ కాకర్లవారిపల్లెకు చెందిన చల్లగుండ్ల సుదర్శన్ అనే భక్తుడు ఈపథకానికి 1,01.116 విరాళంగా అందజేశారు. ఈమొతాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఛైర్మన్ మణినాయుడుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెడెంట్ వాసు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## బావిలో పడి యువకుడు మృతి

ఐరాల, మే 30 ప్రభాతవార్త:



సరదాగా వ్యవసాయబావి వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తు కాలుజారి పడి యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలోని విఎస్.అగ్రహారం గ్రామంలో శనివారం జరిగింది.సంఘటనకు సంభందించి వివరాలి లావున్నాయి. చిత్తూరు నగరం శంకరయ్యగుంటకు చెందిన ఎస్ంఖాదర్‌భాషా కుమారుడు ఎస్.షరీప్ అనే యువకుడు విఎస్.అగ్రహారంలోని తమ బంధువుల ఇంటికి శుక్రవారం రాత్రి వచ్చాడు. బంధువుల ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో సరదాగా గడిపాడు. వేడుక అనంతరం బంధువులు అందరూ వెళ్ళిపోగా పాఠశాలకు సెలవులు కావడంతో షరీప్ మాత్రం అక్కడే వుండి పోయాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం గ్రామంలోని ఒక యువకుడితో కలసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్ళాడు. అక్కడ ఈత కోసం బావిలో దిగుతుండగా ప్రమాదాశాత్తు కాలు జారీ బావిలో పడిపోయాడు. షరీఫ్‌కు ఈత రాకపోడంతో బావిలోని నీతిలో మునిగిపోయాడు.ఈవిషయాని న్ని గమనించిన వెంట వెళ్లిన యువకుడు గ్రామంలోకి వెళ్లి సమాచారం అందించాడు. అనంతరం గ్రామస్తులు బావి వద్దకు చేరుకుని పాతాళభైరవి సాయంతో మృత దేహాన్ని బావి నుండి వెలికి తీసి అక్కడ నుండి మృత దేహాన్ని చిత్తూరుకు తరలించారు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదని తెలుస్తోంది.

## తహశీల్దార్ ఉపతహశీల్దార్లకు ఘనసత్కారం

పెద్దపంజాణి, మే 30 ప్రభాతవార్త:



పెద్దపంజాణి మండల తహశీల్దార్‌గా పనిచేసిన హనుమంతునాయక్ ఉపతహశీల్దార్‌గా పనిచేసిన రమేష్‌బాబులను మండల రెవెన్యూకార్యాలయంలో ఘనంగా సత్కరించారు.శనివారం వీరు పదవీవిరమణ పొందడంతో రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.పలమనేరు ఆర్డీఓ భవాని ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వ అధికారులు ప్రజలకు నిబద్ధతోచేసిన సేవలే గుర్తింపుతెస్తాయని పేర్కొన్నారు.పదవీ విరమణ పొందినవారి తదుపరి జీవితాలు ఆరోగ్యంగా సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ప్రస్తుత తహశీల్దార్ రామ్మూర్తి,రీసర్వే తహశీల్దార్ రాకేష్‌రెడ్డి,ఆర్ఐ రాకేష్‌కుమార్,విఆర్వోలు,తెదేపా నాయకులు ఏఎంసి డైరక్టర్ శంకరప్ప,చౌకదుకాణం డీలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు పంపిణీ

పెద్దపంజాణి, మే 30 ప్రభాతవార్త:



వేశవిసెలవులు సందర్భంగా మండలంలోని రాజు పల్లిలో ఎస్.పి.ఎం చర్చిఫాధర్ శ్యాముల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ మరియు ఆటలపోటీలు నిర్వహించారు.శనివారం విద్యార్థులకు వైకాపా జిల్లా ప్రధానకార్యదర్శి తమ్మిరెడ్డి బహుమతులను అందజేశారు.వేశవిలో పిల్లలు క్విజ్,ఆటలపోటీలను సద్వినియోగం చేసుకోవడంపట్ల పిల్లలను అభినందించారు.ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన చర్చిఫాధర్ శ్యాముల్‌ను ఆయన అభినందించారు.కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

తిరుపతి హెల్త్, మే 30, ప్రభాతవార్త




శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం శ్రీ పద్మావతి ఓ.పి.డి బ్లాక్ నందు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (మే 31వ తేది)ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్, సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్, మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్, ప్రొఫెసర్ డా. హరిక్రిష్ణ, డా. భార్గవ్, డా. చంద్రశేఖర్, డా. బాబు, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. నాగరాజ్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాన్ని తెలిపేందుకు అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం మే 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంను మన స్విమ్స్‌లో కూడా జరుపుకుంటున్నామని, పొగాకు వాడకం ద్వారా శరీరంలో ప్రధాన భాగాలు చెడిపోవటం, తద్వార మరణాలు సంభవించడం వంటి వాటితో సమాజంతో పాటు వారి కుటుంబాలు కూడా తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ మరియు మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే హాని గురించి అవగాహన కల్పించడం ఈ యొక్క కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పొగాకు రహిత సమాజాన్ని నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మెడిసిన్ ప్రొఫెసర్ డా. హరికృష్ణ పొగాకు మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరిస్తూ పొగాకు మానేయడం వల్ల ఊపిరితిత్తులు, గుండె ఇతర ఆరోగ్య సమస్యల నుండి త్వరిత గతిన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా. భార్గవ్ మాట్లాడుతూ గ్లోబల్ అడల్ట్ టుబోకో సర్వే ప్రకారం భారతదేశం పొగాకు వాడకం తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మిగిలిందని, మొత్తం జనాభాలో దాదాపు పురుషులు 42.4 శాతం, మహిళలు 14.2 శాతం, వాడుతున్నారని, కేవలం పొగత్రాగడం కాకుండా ఖైనీ, గుట్కా, జర్దా, పాన్ మసాలా వంటి పొగ రహిత పొగాకు వాడకం అత్యంత ఎక్కువగా వుందని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా. బాబు పొగాకు వాడకం వల్ల కలిగే అనారోగ్య ప్రభావాలు గురించి వివరిస్తూ పొగాకు వాడకం వల్ల తీవ్రమైన, ప్రాణాంతకమైన అనారోగ్య సమస్యలు వస్తాయని ఇందులో వుండే నికోటిన్ అత్యంత వ్యసన పరుడుగా మారుస్తుందనీ దీనివల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు వంటి దీర్ఘకాలిక జబ్బులు వచ్చే ప్రమాదం వుందని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆకర్షణల వెనుక ఉన్న నిజాన్ని తెలుసుకుందా నికోటిన్ మరియు పొగాకు వ్యసనాన్ని ఎదుర్కొందాం అనే థీమ్‌గా (ఇతి వృత్తం) ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని పొగాకు వాడకం వల్ల వాడే వారికే కాకుండా పక్కన వారికి కూడా ప్రమాదం వుంటుందని తెలియజేశారు. శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. నాగరాజ్ మాట్లాడుతూ పొగాకు తయారీ సంస్థదారులకు కూడా పర్యావరణానికి కలిగే హానిని తగ్గించడానికి తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలనే వంటి అంశాల గురించి వివరించడం జరిగింది. పొగాకు వాడకం వల్ల కనీసం 20 రకాల క్యాన్సర్లతో సంబంధం వుంటుందని ప్రతి సంవత్సరం సుమారు 24 లక్షల మంది మరణాలు సంభవిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం నందు మెడిసిన్ విభాగం వైద్యులు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు, ప్రజలు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల కొరడా

### -నాలుగు ట్రిప్పర్‌లు, హిటాచి స్వాధీనం: నలుగురు నిందితులు అరెస్ట్

తవణంపల్లె, మే 30 ప్రభాతవార్త:




మండలం నుండి ట్రిప్పర్‌ల ద్వారా ఇసుకను ట్రిప్పర్‌ల ద్వారా అక్రమంగా కర్నాటకు తరలిస్తున్న వ్యక్తులపై తవణంపల్లె పోలీసులు కొరడా ఝుళిపించారు. ఇసుకను తరలించడానికి ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి నాలుగు ట్రిప్పర్‌లు, ఒక హిటాచిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని గోవిందరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని పిల్లవంక, దాని పక్కనే వున్న చెక్‌డ్యాం వద్ద శనివారం ఉదయం హిటాచి సాయంతో ట్రిప్పర్‌ల ద్వారా ఇసుకను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా కర్నాటకు తరలించడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించి స్థానిక ఏఎస్ఐ మురళీప్రసాద్ పోలీసు స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని బంగారుపాళ్యం మండలం శెట్టేరికి చెందిన బి.బాబు(43), ఎగువ రాగిమానుపెంటకు చెందిన ఆర్.మధునాయుడు(41), శెట్టేరికి చెందిన వి.గిరి(31), బీహార్‌కు చెందిన నితీష్‌కుమార్(31), ట్రిప్పర్‌లు, హిటాచి యజమాని బంగారుపాళ్యంకు చెందిన హరిప్రసాద్‌నాయుడులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే నాలుగు ట్రిప్పర్‌లు, ఒక హిటాచిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. నిందితులు మండలంలోని గోవిందరెడ్డిపల్లె పిల్లవంక, పక్కనే వున్న చెక్‌డ్యాం వద్ద నుండి ఎటువంటి అనుమతులు లేకుండా కర్నాటక రాష్ట్రం బెంగుళూరు సరిహద్దు ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించడానికి ఇసుక దొంగతనానికి పాల్పడినట్లు

## అర్హులైన రైతులకు అందరికి

### పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ఫలాలు అందాలి

విజయపురం, మే 30 ప్రభాతవార్త:

మండలంలోని రైతులందరికి పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవఫలాలు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ లక్ష్మీపతిరాజు, నగరి ఏఎంసీ ఛైర్మన్‌రాజమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్‌లు తెలిపారు. శనివారం విజయపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పలువురు రైతులు అర్హులుగా ఉండి కూడా పీఎంకిసాన్ అన్నదాత సుఖీభవ నిధులు అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల లిస్టు ప్రకారం డబ్బులు పడుతున్నాయా...లేదా....అనిసంబంధితఅధికారులు తెలుసుకుని నిజమైన లబ్ధిదారులు నష్టపోకుండా చూడాలన్నారు. ప్రతి మండలసర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఆ దిశగాచర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో లబ్ధిదారుల వివరాలను ప్రజాప్రతినిధులకు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అర్హులైన రైతులందరికి పీఎం కిసాన్, అన్నదాతసుఖీభవపథకం తప్పకుండా అందేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## గంజాయి రహిత సమాజం కోసమే ఈగల్ ఫోర్స్ : డీఎస్పీ రవికుమార్




సత్యవేడు, మే 30 ప్రభాతవార్త:

గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి గంజాయి రహిత సమాజం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ ఫోర్స్ యాంటీ గంజాయి టీమ్స్ వంటి ప్రత్యేక విభాగాలను రంగంలో దించినట్టు తిరుపతిజిల్లా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. శనివారం సత్యవేడు వీఎంకే కల్యాణ మండపంలో సీఐ మురళీనాయుడు అధ్యక్షతన గంజాయి నిర్మూలనపై పలువురు యువకులకు అవగాహన, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయిసేవించడంవల్ల యువకుల్లో నేర ప్రవృత్తి అధికమవుతున్నట్లు తెలిపారు. దీన్ని సమూలంగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో గంజాయి వాడకం, రవాణా, విక్రయాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పోలీసు శాఖ చేపట్టిన నిఘా, అవగాహన కార్యక్రమంఅన్నారు. ప్రత్యేక డ్రగ్స్, డిటెక్షన్ కిట్ల ద్వారా ఎవరైనా సరే గంజాయి సేవించారా అన్నది ఒక్క నిమిషంలో నిర్ధారించవచ్చునన్నారు. ఇది గంజాయి సేవించిన 50 రోజుల్లో పరీక్ష ద్వారా తేలుతుందన్నారు. తొలిసారి గంజాయి వాడినట్లు తేలిన ఎటువంటి కేసులు నమోదు చేయమన్నారు. అయితే మళ్లీ రెండో సారి పరీక్షల్లో గంజాయి వాడినట్లు తెలిస్తే కేసునమోదు చేసిజైలుకు పంపడం జరుగుతుందన్నారు. అనంతరం సత్యవేడులో 20 మందికి కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్‌గా తేలగా నాగలాపురం నుంచి 17 మందిని పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్, వరదయ్యపాళెం నుంచి 15 మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురు పాజిటివ్ కేసులు నమోదైనట్లు స్థానిక ఎస్ఐ సాయినాథ్‌చౌదరి పేర్కొన్నారు. యువకుల మూత్రాన్ని శాంపిల్ తీసుకుని కిట్లు ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో యువకులకు గంజాయి వాడకం వల్ల ఏర్పడే శారీరక రుగ్మత వంటిపలు అంశ్వాలపై కౌన్సిలింగ్ ఇవ్వడంజరిగింది. కార్యక్రమంలో ఎస్ఐలు సాయినాథ్‌చౌదరి, లావణ్య, మల్లికార్జున్, సునీల్, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

## శ్రీవిద్య పువ్వల డాక్టరేట్

తిరుపతి,మే 30ప్రభాతవార్త:



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని శ్రీవిద్య పువ్వలకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ ఆచార్య కె.అనురాధ తెలిపారు. ఈమె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ వై. ఇందిరా ముజీబ్ మార్గదర్శకత్వంలో నానోటెక్నాలజీ అప్రోచెస్ ఫర్ పల్మనరీ డ్రగ్ డెలివరీ ఆఫ్ సమ్ సెలెక్టెడ్ డ్రగ్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకుగాను పరిశోధన విద్యార్థిని శ్రీవిద్య పువ్వల కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. శ్రీవిద్య పువ్వల కి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 583 మంది గైర్హాజరు: ఆర్ఐఓ

తిరుపతి విద్య, మే 30 ప్రభాత వార్త



ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ (ఐపీఏఎస్ఈ) మే-2026 సిద్ధాంత పరీక్షలకు తిరుపతి జిల్లాలో 583 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్ఐఓ) రాజశేఖర్ రెడ్డి తెలిపారు.జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,147 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు కేటాయించగా, 3,564 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. గైర్హాజరైన విద్యార్థుల సంఖ్య 583గా నమోదైందని వెల్లడించారు.పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించామని, అన్ని కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.మొత్తంహాజరుశాతంసుమారు86 శాతంగా నమోదైందన్నారు.

## బాలిక అదృశ్యం

తిరుపతి, మే 30 ప్రభాతవార్త:

ఇంట్లో మిద్దెపైకి వెళ్ళిన బాలిక తిరిగి ఇంట్లోకి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక కనబడటులేదని ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుపతినగరంలోని గాజుల వీధిలో(16 ) 9వ తరగతి పూర్తి అయి ఇంటిదగ్గర ఉంటుంది. పదవతరగతికి వెళ్లనుంది. 29 రాత్రి శుక్రవారం మిద్దె పైకి వెళ్లిన విద్యార్థిని తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెదికారు. శనివారం సాయంత్రం వరకు ఆచూకీ తెలియకపోవడంతో కుమార్తె కనబడుట లేదని వెస్ట్ పోలీస్ స్టేషన్లో తండ్రి మనోజ్ కుమార్ ఫిర్యాదు చేశాడు. తిరుపతి వెస్ట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదైంది.

## మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు : ఎంపీడీవో

విజయపురం, మే 30 ప్రభాతవార్త:

మండలంలో మంచినీటి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోనిసామిరెడ్డి కండ్రిగ, కలియంబాకం, మిట్టకండ్రిగ తదితర గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతి పంపులను ఆయన స్వయంగా దగ్గరుండి మరమ్మతులు చేయించారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank
Together we can
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
తిరుపతి తిరుమల హిల్స్ శాఖ,
తిరుపతి, తిరుపతి జిల్లా

**అమ్మకం ప్రకటన**

**సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన **రుణగ్రహీత ఎ.బి.మారుతి ప్రసాద్ & గ్యారంటారు: శ్రీ ఎ.బి.శేషాద్రి మరియు ఎ.బి.కేసరికుమార్** గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, తిరుపతి తిరుమల హిల్స్ శాఖ, కెనరాబ్యాంక్ వారికి బకాయి వున్న రూ.9,78,973.08పై లను + డిమాండ్ నోటీసు తేది: 01.11.2023 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను** రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని **"ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై 02.07.2026న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.**

**స్థిరాస్తి వివరములు:-** చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి రేణిగుంట సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, నెం.11 తిరుచానూరు గ్రూపు, గ్రామ కంఠం, తిరుచానూరు గ్రామ పంచాయతీ, వార్డునెం.8 సర్వేనెం418/2 లోని డి.నెం.8-15/2 గల జి+1 రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: తూర్పు: ఎం.జి.చారి ఇల్లు, పడమర: ఎస్.వి.క్రిష్ణ స్వామి, ఉత్తరం : వేపమాను వీధి, దక్షిణం: ఎ.బి. కేసరి కుమార్ ఇల్లు. కొలతలు: తూర్పు నుండి పడమర: 12 1/2 అ. లేదా 3.812మీ. ఉత్తరం నుండి దక్షిణం: 42 1/2 అ. లేదా 12.962మీ. వెరశి 531.25 చ.అ. లేదా 59.02 చ.గ.లు

**రిజర్వు ధర : రూ.31,25,000.00** **ధరావత్తు : రూ.3,12,500.00**

**ధరావతు సమర్పణకు ఆఖారు తేది & సమయం: 30.06.2026 సా.5.00గం॥లకు లేదా ఆలోపు**, అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com**లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. **లేదా అధీకృత అధికారి, కెనరాబ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి, ఫోన్:0877-2500130, వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.**

ప్రదేశం:తిరుపతి, తేది: **27.05.2026** అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

# ముంచుకొస్తున్న మురుగునీటి ముప్పు!

- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- ప్రమాదపు అంచున సూళ్లూరుపేట వాసులు





సూళ్లూరుపేట, మే 30 ప్రభాతవార్త: సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డులో ప్రవహిస్తున్న నెర్రి కాలువ రోజు రోజుకి కాలుష్యం కోరల్లో చిక్కి తన ఉనికిని కోల్పోతుంది. పట్టణంలోని మురుగునీరు మొత్తం ఈ కాల్వగుండానే వెలుపలకి వెళ్ళాల్సి రావడంతో కాలువ దిగువ ప్రాంతాల్లో ఉండే గ్రామాల్లోని చెరువులు, బోర్లు, కలుషితమోతూ వస్తున్నాయి. ఈ విషయమై పలు సంవత్సరాలుగా నెర్రి కాలువ దిగువ ప్రాంత రైతులు, ప్రజలు ఆందోళన చేస్తున్నప్పటికీ తూతూ మంత్రంగా చర్యలు చేపడుతూ అధికారులు, నేతలు కాలం వెలిబుస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం దిగువ ప్రాంత రైతులు వాటంబేడు రోడ్డు లోని నెర్రి కాల్వ లాకుల దగ్గర మట్టి పోసి ఈ కలుషిత నీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో ఈ నీరు మొత్తం వెనుకకు తన్ని వేయడంతో శ్రీ చెంగాలమ్మ దేవస్థానం సమీపం నుంచి చిన్న సత్రం వరకు కాలువలోని నీరు మొత్తం రంగు మారి పూర్తిగా కలుషితం అయి పోయాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో సూళ్లూరుపేట ప్రాంతంలో అంతంత మాత్రంగానే మంచినీటి వనరులు ఉన్నాయి. ఇందుకు తగ్గట్టుగా పట్టణంలోని నివాస గృహాల్లో ఉన్న బోర్లు బాగా అడుగంటిపోయాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం నెర్రి కాలువ పరివహ ప్రాంతాల్లో ఉంటున్న నివాస గృహాల్లోని బోర్లలో కలుషిత నీరు చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**అధికారుల స్పందన:**

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య వివరణ ఇస్తూ త్వరలోనే ఇరిగేషన్ అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఇరిగేషన్ డిఇ కస్తూరి వివరణ ఇస్తూ గత కొంత కాలంగా ఈ సమస్య కొనసాగుతుందని దిగు ప్రాంత రైతులు తమకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు తాను లేఖను రాసినట్టు చెప్పారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అందుకు తమ వంతు సహకారం అందిస్తామని సమాచారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జఠిలమైన ఈ సమస్యను పరిష్కరించవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే గారు కాస్త దృష్టి సారించండి:**

సూళ్లూరుపేట పట్టణ ప్రజల చిరకాల తీరని సమస్య అయిన నెర్రి కాలువ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టి సారించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులతో చర్చించి మురుగునీటి సమస్య నుండి విముక్తి ప్రసాదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ప్రతిపాదించిన మాస్టర్ డ్రైనేజీ పథకం గురించి పరిశీలించాలని కోరుతున్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, మే 30 ప్రభాతవార్త: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని ఫిష్ మార్కెట్ ప్రాంతంలో క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రం చేసుకోవా లంటే కేవలం పారిశుధ్య కార్మికుల మీద ఆధారపడకుండా మనందరం దీనిపై శ్రద్ధ వహించవలసిన అవసరం ఉందని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మురికి కాలవలో వేయడం వల్ల అనేక అనర్థాలకు కారణం అవుతున్నాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత లో భాగంగా ప్రతి ఒక్కరు పచ్చని చెట్లను పెంచే కార్యక్రమాన్ని వ్యక్తిగతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం ఈ ప్రాంతంలో ఆమె మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులతో కలసి రోడ్లను శుభ్రం చేసి, మురుగు కాల్వలోని చెత్తను వెలికి తీశారు. అనంతరం స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞను చేయించారు. అలాగే పార్కు వీధిలోని దుర్గంధ భరితమైన సందులో కిఆమె స్వయంగా వెళ్లి శుభ్రం చేసే ప్రక్రియను చేపట్టారు. అక్కడే గోడకు సున్నం వేశారు. నడి బజారులో ఉండే ఈ సందులో పరిశుభ్రతను పాటించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఇందుకు ప్రజలు సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి. దేవేందర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ ఆకుతో రమేష్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, దంతాల రవి, కొండలరావు, సెట్ రాజా, కమిషనర్ కే చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాలినడకతో శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం



వాకాడు, మే 30 ప్రభాతవార్త: టిడిపి సీనియర్ నాయకుడు, ఆలయ ధర్మకర్త దువ్వూరు జనార్ధన్ రెడ్డి కోట మండలం విద్యానగర్ నుండి వాకాడు మండలం కల్లూరు కొత్తపాలెంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్లూరు కొత్తపాలెం వెలసిన నూతన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ ధర్మకర్త దువ్వూరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అనేకమంది భక్తులుకు విశేష పూజలు, అభిషేకాలు ఆలయ పూజారి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, పలువురికి నాయకులకు తిరుమల కండువా కప్పి ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

## పేర్నాడు పిహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



సూళ్లూరుపేట, మే 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లోని పేర్నాడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని రికార్డులను పరిశీలించారు. అక్కడ రోగులను విచారించి వైద్య సేవలు సక్రమంగా అందుతు న్నాయా లేదా అని ప్రశ్నించారు. ఆసుపత్రిలో మందులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా అంటూ డాక్టర్ రమణయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తీర ప్రాంత గ్రామాలైన కొరిడి, దామరాయి, కడపట్ర పంచాయతీలలో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అత్యంత అవసరమని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సేవా భావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కడపట్ర గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సమస్యలకు సంబంధించి 177 వినతి పత్రాలు ప్రజల నుంచి స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే తీరప్రాంత గ్రామాల చిరకాల కోరిక అయినా అటకానితిప్ప నుంచి కడపట్ర వరకురోడ్డు నిర్మాణానికి శాయ శక్తుల కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కొక్కు శంకరయ్య, పాకం వెంకట సుబ్బయ్య, మురళిరెడ్డి, తహసిల్దార్ శైల కుమారి తదితరులు పాల్గొన్నారు.

## కలవకూరులో పౌర హక్కుల దినోత్సవం



పెళ్ళకూరు, మే 30 ప్రభాతవార్త : పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగించేలా ప్రవర్తించినా హక్కులను అడ్డుకోవాలని చూసినా ఎంతటి వారైనా ఉపేక్షించే పనేలేదని వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెళ్లకూరు తహసిల్దార్ సిహెచ్ హరి కృష్ణ ప్రజలకు హామీ ఇచ్చారు. శని వారంనాడు మండలంలోని కలవ కూరు గిరిజన కాలనీలో జరిగిన పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని అక్కడ ఉన్న గిరిజనులకు పౌర హక్కులపైన, చట్టాల పైన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించడం ద్వారా తమ జీవితాలను మెరుగుపరుచుకోవచ్చని అందుకోసం ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలును వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణితో పాటు హౌసింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, వెలుగు అధికారులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## మురుగునీటి కాలువల్లో వ్యర్థాలు...అనారోగ్యానికి మార్గాలు

-డిప్యూటీ కమిషనర్ అమరయ్య

తిరుపతి కార్పొరేషన్, మే 30 ప్రభాతవార్త: మురుగునీటి కాలువల్లో వేసే వ్యర్థాల వలన ప్రజలు అనారోగ్యం పాలు అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య ప్రజలకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా అన్నారావు కూడలి వద్ద ఉన్న పెద్ద డ్రైనేజి కాలువలో పేరుకు పోయిన చెత్త, మట్టిని శనివారం ఉదయం తొలగించారు. కాలువల్లో చెత్త వేయడం వలన కలిగే అనర్థాలపై డిప్యూటీ కమిషనర్ అమరాయ్యతో గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సిబ్బంది కలసి ప్రజలకు అవగాహన కల్పించారు. కాలువల్లో చెత్త చెదారం వేయడం వలన అవి అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో ఇరుక్కుపోయి కుళ్ళిపోతు న్నాయని తెలిపారు. అలాగే మురుగునీరు సజావుగా వెళ్ళక రోడ్డుపైకి వచ్చి అపరిశుభ్రత ఏర్పడుతోందని తెలిపారు. అలాగే దోమలు పెరిగి ప్రజలు




అనారోగ్యం పాలు అవుతారని తెలిపారు. మీ ఇల్లు, కార్యాలయాల వద్ద ఏర్పడిన చెత్తను తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలు గా విభజించి తమ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. అంతే తప్ప కవర్లలో కట్టి కాలువల్లో, కూడళ్ళలో వేయవద్దని తెలిపారు. నగరపాలక అధికారులకు, సిబ్బందికి సహకరించి స్వచ్ఛ తిరుపతి సాధనకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు, వాగులను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విభాగం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలు : వీస్తున్న వడగాడ్పులు

**నీటిలో ఈదుతూ పిచ్చుకల జలకాలాటలు**



పలమనేరు, మే 30 ప్రభాతవార్త: చల్లదనానికి మారుపేరైన పలమనేరు అగ్నిగుండంగా మారుతోంది. పగలు ఎండల వేడిమితో అట్టుడుకుతోంది. ఉదయం 10 గంటలయ్యే సరికి ప్రజలు ఇళ్ళు వదలి బయటకు వెళ్ళడంలేదు. మధ్యాహ్నం ఎండవేడిమికి తట్టుకోలేక ఉదయం సాయంత్రం మాత్రమే పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఇక ఎండలకు మనుషులే కాదు, పశువులు, పక్షులు సైతం తట్టుకోలేక పోతున్నాయి. ఈ పరిస్థితిలో పిచ్చుకలు కూడా ఎండలకు వివిధ రకాలుగా ఉపశమనం పొందుతున్నాయి. మురుగుకాలువల్లోని నీటిలో జలకాలాడుతూ కేరింతలు కొడుతున్నాయి. పట్టణంలోని ముత్తాచారిపాళ్యంలో ఓ వీధికాలువలో పిచ్చుకల కిలకలారావాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దారిన పోయే వారు ఈ వింతను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## సింహవాహనంపై కల్యాణ వెంకన్న



తిరుపతి(నారాయణవనం), మే 30ప్రభాతవార్త: టిటిడి ఆధ్వర్యంలోని నారాయణవనం పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సింహవాహనంపై సుదర్శన నరసింహుడి అలంకారంలో శ్రీనివాసుడు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. పరాక్రమం, ధైర్యం, తేజస్సు, ఆధిపత్యానికి ప్రతీకైన సింహరూప దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయారు. వాహనం ముందు భక్త బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో గోవింద నామస్మరణ చేస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కటాక్షాన్ని పొందారు. రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనంపై స్వామిభక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో ముక్తిమార్గం

-వేడుకగా గోవిందనామస్మరణ



తిరుపతి,మే 30ప్రభాతవార్త: పవిత్రమైన తిరుపతి నగరంలో ప్రతి శనివారం తెల్లవారుజామునే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో, నుదుటిపై గోవింద నామాలతో గోవింద నామస్మరణలతో పునీతులవుతున్నారు. గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య నగర సంకీర్తన ప్రారంభమైంది. గోవింద.. గోవింద.. అనే నామస్మరణతో తిరుపతి వీధులు ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో భక్తి భావాన్ని నింపాలనే లక్ష్యంతో మండలి సభ్యులు సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు మునెప్ప గారి మునినాథరెడ్డి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి,, విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, మిట్టపల్లి బ్రహ్మానందం, కన్నప్ప గారి కేశవులు, నాగేశ్వరరెడ్డి, రాజేంద్రన్,సుధాకర్ చౌదరి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అరుణమ్మ, జయమ్మ,విజయ కుమారి, అమరావతి,రేవతి, తదితరులు పాల్గొన్నారు.

**గోవిందరాజస్వామి కృపాకటాక్షాలతో**

## భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ



తిరుపతి,మే 30ప్రభాతవార్త: గోవిందరాజస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ పవిత్ర రథోత్సవంలో స్థానిక రాయలసీమ రంగస్థలం కళాకారులు భక్తి పూర్వకంగా పాల్గొని స్వామివారికి తమ సేవలను సమర్పించారు. రథోత్సవం అనంతరం తూర్పు మాడవీధిలో రాయ లసీమ రంగస్థలం కళాకారులు భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఈ అన్నదాన సేవలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, భాస్కర్, వీరభద్రరావు, విజయ్, రెడ్డి బాబు, పురోహితుడు సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, మే 30 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలో ప్రణాళిక బద్ధంగా మంచినీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని వందల గుంట ప్రాంతంలో ఆరు మంచినీటి బోర్లను వేసే కార్యక్రమానికి శనివారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు లభ్యమవుతున్న నీటి వనరులను ఆధారంగా అవసరమైన చోట్ల బోర్లు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆర్డిఒ వి. దేవేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిపో మేనేజర్ పదవి విరమణ



వాకాడు, మే 30 ప్రభాతవార్త: వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం చిన్న పెంచలయ్య శనివారం పదవి విరమణ చేశారు. డిపో ఆవరణలోని ఆర్టీసీ కార్మిక సంఘాలు, ఆఫీస్ ఇబ్బంది కలిసి డిపో మేనేజర్ చిన్న పెంచలయ్య దంపతులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన డిపో మేనేజర్ చిన్న పెంచలయ్య 37 సంవత్సరాలు బాధ్యతగా ఉద్యోగం చేశారని, ఇప్పటివరకు 17 డిపోలలో డిపో మేనేజర్‌గా పనిచేశారని ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ బాబు, రఘురామయ్య, రాజా నాయుడు, సంపత్ కుమార్, భాస్కర్, సుబ్బయ్య, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బందిలు పాల్గొన్నారు.

## రేపు బడి పిలుస్తోంది కార్యక్రమం

తడ, మే 30 ప్రభాతవార్త : బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తడ విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. బడి పిలుస్తోంది ప్రచారరథం సోమవారం మండల పరిధిలో గ్రామాలను తిరుగుతున్నది ప్రచారరథం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించడం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సాధిస్తున్న ఉత్తీర్ణత వివరించడం ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు తెలియజేశారు.

## పాండురంగస్వామి తిరునాళ్ళులో ఎమ్మెల్యే



శ్రీకాళహస్తిరూరల్,మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు దళిత వాడలో శనివారం పాండురంగస్వామి తిరునాళ్ల సందర్భంగా అనంద అగ్నిగుండ మహోత్సవంను యువకులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువకులు, యువతులు ఎంఎల్‌ఏతో సెల్ఫిలకు ఉత్సాహం చూపారు. దాంతో ఎంఎల్ఏ కూడా వారి ఉత్సాహాన్ని మరింత ఉత్సాహ పరుస్తూ వారితో మమేకమయ్యారు. గ్రామస్తుల ఆ హ్వానం మేరకు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎంఎల్ఏకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు. ఎంఎల్ఏతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు పాల్గొన్నారు. దళితవాడలో ఏర్పాటు చేసిన సాంస్కృతికకార్యక్రమాలను తిలకించారు.

## గుడిమల్లంకు శ్రీకాళహస్తి,తిరుపతి ప్యాకేజి ఇవ్వండి

-ఎంఎల్ఏ,ఆర్ఎంకు వినతి



ఏర్పేడు,మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వ రాలయానికి తిరుపతి, శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేక ప్యాకేజిని ఏర్పాటు చేయాలని ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు కోరారు. శనివారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గృహంలో ఆలయాభివృద్ధికి సంబంధించి చైర్మెన్ గిరినాయుడు చర్చించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చైర్మెన్ గిరినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటి శివాలయంగా ప్రసిద్ధి చెందిన పరశు రామేశ్వరాలయం ఖ్యాతిని దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాల్సి ఉందన్నారు. తాను ఇప్పటికే కేంద్రంలోని పురావస్తుశాఖతోనూ, అలాగే రాష్ట్ర పురావస్తు శాఖతో పాటు పర్యాటక శాఖలతో చర్చినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిని మనం సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ సూచించారు.

**ఆర్‌టిసి ప్యాకేజిని ఏర్పాటు చేయండి:**

శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచనలతో బత్తలగిరినాయుడు శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒ బికె వెంకటేశులును కలిసినారు. ఎంఎల్ఏ ప్రతిపాదనలు వివరించగా ఆయన ఓకే చేసారు. తరువాత ఆయన తిరుపతిలోని ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ జగదీష్ మంగళం డిపో మేనేజర్ సుధాకర్,ట్రాపిక్ ఇన్స్‌పెక్టర్ స్టార్ కృష్ణను కలసి తిరుపతి నుంచి గుడిమల్లం,గుడిమల్లం నుంచి శ్రీకాళహస్తి అక్కడ నుంచి తిరుపతికి నడిచే విధంగా బస్సుల ప్యాకేజిని ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం ట్రయల్ రన్ నడుపాతామని అలాగే ప్యాకేజీ ఎంత అనేది నిర్ణయిస్తామంటూ ఆర్ఎం భరోసా ఇచ్చారు.

## మంగంపేట అగ్రహారం గ్రామాన్ని... సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**తిరుపతి జాయింట్ కలెక్టర్ గోవిందరావు**



ఓబులవారిపల్లి, 30 మే ప్రభాతవార్త: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం మంగంపేట అగ్రహారం గ్రామాన్ని వరితిగతిన సురక్షిత ప్రాంతాలకు ఇంటి స్థలాలు ఏర్పాటు చేసి తరలించాలని తిరుపతి జాయింట్ కలెక్టర్ గోవిందరావు తిరుపతి ఆర్డిఓ రామ మోహన్ కు ఆదేశించారు ఈ సందర్భంగా ఆయన శనివారం మంగంపేట అగ్రహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు అక్కడ బ్లాస్టింగ్ సమస్య నివాసాలు స్థలాలు ప్రజలకు సురక్షితంగా లేవనే ఉద్దేశంతో అగ్రహారం గ్రామాన్ని కొత్తగా ఇంటి స్థలాలు ఏర్పాటు చేస్తున్న ముక్కు వారి పల్లి అవినీ విలేజ్ ఆర్ఆర్ ఫైవ్ పక్కన ఉన్న ఇంటి స్థలాల వద్దకు ఏపీఎండిసి ఆక్ట్ ప్రకారం న్యాయబద్ధంగా ఇంటి స్థలాలు అందించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన సూచించారు అనంతరం ఏపీఎండిసి బన్నులను ఏపీ ఎంబీసీ కార్యాలయాలను పరిశీలించి అక్కడ పరిస్థితులను ముగ్గురాయి ఉత్పత్తులు వాటి డిమాండ్లు వాటి వినియోగాల గురించి ఏపీఎండిసి సీపీఓ గోపినాదును అలాగే మైన్స్ మేనేజర్లు తదితరులను అడిగి బ్లాస్టింగ్ డ్రిల్లింగ్ పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి తహసిల్దార్ యామిని మల్లికార్జున మండల సర్వేయర్ నాగలక్షి ్మ ఏపీఎండిసి అధికారులు చలపతి రెడ్డి మరియు బ్లాస్టింగ్ బిల్డింగ్ అధికారులు అగ్రహారం గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చల్లని మజ్జిగతో దాహార్తి తీర్చిన "టోల్ ప్లాజా"

చంద్రగిరి, మే 30 ప్రభాతవార్త:



వేసవి తాపంతో విలవిలాడుతున్న ప్రయాణికులకు గాదంకి టోల్ ప్లాజా యాజమాన్యం చల్లని మజ్జిగను అందజేసి దాహార్తిని తీర్చుతున్నారు. చిత్తూరు – మల్లవరం ప్రాజెక్ట్ "నేషనల్ హైవే ఇన్‌ఫ్రా ట్రస్ట్" సదరన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్" (ఎన్‌హెచ్ఐటి ఎన్ఎస్‌పిపిఎల్) ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. సామాజిక సేవలందించడంలో "ఎన్‌హెచ్ఐటి ఎన్ఎస్‌పిపిఎల్" ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలుస్తున్న నేపథ్యంలో ద్విచక్ర వాహన చోదకులకు, ఆటో డ్రైవర్లకు, తిరుమలకు కాలినడకన వస్తున్న భక్తులకు వేసవి తాపం నుండి ఉపశమనం కల్పించేందుకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు వీరి సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. గాదంకి టోల్ ప్లాజా మేనేజర్ సెంధిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరికి ఘన సన్మానం

చంద్రగిరి, మే 30 ప్రభాతవార్త:



నవ భారత సేవా సమాజ్ (ఎన్ఎస్ఎస్) కో ఆర్డినేటర్లు తనుష్క, సులోచన ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరిని ఘనంగా సన్మానించారు. మండల వ్యాప్తంగా సమాజ సంక్షేమాన్ని బలోపేతం చేయడంలో నవ భారత సేవా సమాజ్ చేపడుతున్న క్రామాలను తహశీల్దార్‌కు వివరించారు. మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించడం, జీవనోపాధిఒ అవకాశాలు కల్పించడం, సమాజ సంక్షేమాన్ని బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో తహశీల్దార్ మహిళాభివృద్ధికై మీరు చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు.

## తిరుచ్చి వాహనంపై "దేవేరులతో శ్రీనివాసుడు"

చంద్రగిరి, మే 30 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, దిలీప్‌కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన బీసీ సంక్షేమ సంఘం

### జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణవతి యాదవ్

తిరుపతి హెల్త్, మే 30, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్చార్జిగా పనిచేస్తున్న సుగుణవతి యాదవ్ బిజెపి కండువా కప్పుకున్నారు. బీసీలకు, మహిళలకు సముచిత స్థానం బిజెపిలో లభిస్తుందని, నరేంద్ర మోడీ సమర్థవంతమైన నాయకత్వం దేశాన్ని ముందుకు నడిపిస్తున్నదని, వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోడీ బాసటగా ప్రజలందరూ నిలవాలని, ముఖ్యంగా బీసీలను పార్టీ వైపు తీసుకురావాలని అన్నారు. సుగుణవతి యాదవ్ మాట్లాడుతూ బీసీలు పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, పార్టీ కోసం పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షురాలు ప్రశాంతి రాజు, వేదవతి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంకమ్మ ఆలయంలో పోతురాజు ముగ్గు

పుత్తూరు రూరల్, మే 30 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వలెసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి తిరుణాళ సందర్భంగా శనివారం ఉదయం ఆలయ ఆవరణలో వివిధ రంగులతో పోతురాజు ముగ్గును ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేశ్వారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామదేవత అంకాళపరమేశ్వరి తిరుణాళ సందర్భంగా ఆదివారం ఉదయం మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అలాగే మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అమ్మవారికి పొంగళ్లు, సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం అనంతరం రాత్రి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి వెండి చటరీ బహూకరణ

వడమాలపేట, మే 30 ప్రభాతవార్త:



అప్పలాయగుంటశ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి ఓ భక్తుడు వెండి చటరీని బహుకరించారు. తిరుపతికిచెందిన ఉదయ్, కిరణ్‌రెడ్డి శనివారం అప్పలాయగుంట స్వామివారికి సుమారు 50 వేల విలువ గల 189గ్రాములవెండి చటరీని సూపరింటెండెంట్ శ్రీవాణి సమక్షంలోఆలయ అధికారి వేణుగోపాల్‌కు అందజేశారు.

### తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుని విహారం

అప్పలాయగుంటలో స్వామివారు శనివారం తిరుచ్చివాహనంపై కొలువుదీరి మాడావీధుల్లో విహరించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు శ్రీవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, అర్చకులు రమణాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

నింద్ర,మే 30 ప్రభాతవార్త :



ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే నాణ్యమైన విద్య అందిస్తుందని మండల విద్యాశాఖాధికారి 2 శ్రీధర్‌రాజు తెలిపారు. శనివారం మండలంలోని ఎలకాటూరు, మిట్టూరు గ్రామాలలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ మండల విద్యాశాఖాధికారి2 శ్రీధర్‌రాజు చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు కాలసిన అన్ని సౌకార్యలను ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ బడులలో విద్యతో పాటు క్రీడలలో కూడా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్రం పరీక్షకు 513 మంది గైర్హాజరు


తిరుపతి విద్య, మే 30 ప్రభాత వార్త



జిల్లాలో శనివారం నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ భౌతిక శాస్త్రం పరీక్షకు 3,641 మంది విద్యార్థులకు గాను 3,128 మంది హాజరుకాగా, 513 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి పరీక్షకు 204 మంది అభ్యర్థులకు గాను 170 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షకు 138 మంది అభ్యర్థులకు గాను 120 మంది హాజరుకాగా, 18 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రత్యేక తనిఖీ బృందాలు ఎనిమిది పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, స్థిర తనిఖీ బృందాలు మూడు పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించాయి. జిల్లాలోని 28 పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించినట్లు కె.వి.ఎన్. కుమార్ తెలిపారు.

## సైనిక్, నవోదయ కోచింగ్‌లో విశ్వం విద్యా సంస్థల మరో ఘనత

తిరుపతి విద్య, మే 30 ప్రభాతవార్త



నగరంలోని వరదరాజ నగర్‌లో ఉన్న విశ్వం విద్యా సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక్ స్కూల్, నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల కోచింగ్ కార్యక్రమాలకు సంబంధించిన 2026 బ్రోచర్‌ను ఎం.వి. రామచంద్ర రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, అప్పుస్మా నాయకులు రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ, 2026 సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 300 మార్కులకు గాను 285 మార్కులు సాధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రథమ ర్యాంకు సాధించడం, అలాగే 57 సైనిక్ స్కూల్ సీట్లు సాధించడం విశ్వం విద్యా సంస్థల ప్రతిభకు నిదర్శనమని అన్నారు. అదేవిధంగా 2026 నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో 61 సీట్లు సాధించడం కూడా సంస్థ విజయగాథలో మరో మైలురాయిగా పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా సైనిక్ స్కూల్, రాష్ట్రీయ మిలిటరీ స్కూల్, నవోదయ విద్యాలయాల వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అగ్ర ర్యాంకులు సాధిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశ్వం విద్యా సంస్థలు విశేష సేవలు అందిస్తున్నాయని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా డా. ఎన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ, గత 36 సంవత్సరాల్లో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 49 రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించడంతో పాటు మొత్తం 1,024 సీట్లు సాధించడం కోచింగ్ రంగంలో అరుదైన ఘనతగా నిలిచిందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, శాస్త్రీయ బోధనా విధానాలు, క్రమబద్ధమైన శిక్షణా కార్యక్రమాలు, సమగ్ర కోచింగ్ వ్యవస్థ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన వివరించారు. ప్రవేశాల వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ 86888 88802,93999 76999 సైనిక్ స్కూల్, నవోదయ విద్యాలయాలు, రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు విశ్వం విద్యా సంస్థలు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆర్టీఈ ఉచిత సీట్ల వివరాలు నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలి

### డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి విద్య, మే 30 ప్రభాతవార్త



విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ-2009) కింద ప్రైవేటు పాఠశాలల్లో కేటాయించిన ఉచిత సీట్లు ఎవరెవరికి దక్కాయనే పూర్తి వివరాలను ఆయా విద్యాసంస్థల నోటీస్ బోర్డుల్లో పారదర్శకంగా ప్రదర్శించడం తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కేవీఎన్ కుమార్ తెలిపారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలని ఆర్టీఈ చట్టం నిర్దేశిస్తోందన్నారు. ఈ నిబంధన అమలులో పూర్తి పారదర్శకత ఉండేలా అర్హులైన విద్యార్థుల జాబితాను బహిరంగంగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. అలాగే ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు లేదా ఇతర విద్యా సామగ్రి పేరుతో ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఆర్టీఈ కింద ఎంపికైన విద్యార్థులకు చట్టం కల్పించిన అన్ని ప్రయోజనాలు ఎలాంటి భారం లేకుండా అందేలా పాఠశాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడినా, ఉచిత సీట్ల వివరాలను ప్రదర్శించకపోయినా సంబంధిత పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో కేవీఎన్ కుమార్ హెచ్చరించారు.

## తిరుచానూరు పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న విచారణ



తిరుచానూరు మే 30 ప్రభాతవార్త :

తిరుచానూరు పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశాలు జారీ చేయడంతో త్రిసభ్య కమిటీ శనివారం తిరుచానూరు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టింది. ఎర్రవారిపాలెం డిప్యూటీ ఎంపీడీవో పద్మారాణి, శ్రీకాళహస్తి డీడీవో సుష్మిత, తిరుపతి డీడీవో గంగాభవాని సభ్యులుగా ఉన్న కమిటీ పంచాయతీ కార్యదర్శితో పాటు ఫిర్యాదులు చేసిన పలువురు మహిళల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తోంది. విచారణ అనంతరం కమిటీ తమ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనుంది. నివేదికలోని అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, విచారణ ఫలితాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# తిరుపతి డివిజన్

## డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య, మే 30 ప్రభాతవార్త



13వ డివిజన్ పరిధిలోని ఎస్‌జీఎస్ కళాశాల రోడ్డులో నెలకొన్న యూడీఎస్ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆరణి శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానికులు మురికి కాలువ నుంచి నీరు పొంగిపొర్లుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో, శనివారం ఉదయం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కూడా పాల్గొన్నారు. తరచూ మురుగు నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా రోడ్డుమధ్యలో కొత్త మ్యాన్‌హోల్ నిర్మించి, దానిని ప్రధాన మురుగు కాలువకు అనుసంధానిస్తే సమస్య తీరుతుందని ఎస్ఈ శ్యాంసుందర్ తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పనులను ఆలస్యం చేయకుండా వెంటనే మ్యాన్‌హోల్ నిర్మించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎస్ఈ శ్యాంసుందర్‌ను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎంఈ తులసి కుమార్, డీఈ రాజు, జనసేన నగర అధ్యక్షుడు రాజా రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎస్‌కే బాబు, అంకాలమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ కొండా రాజమోహన్, ఆనంద్, మణి వర్మ, రమేష్ నాయుడు, పవన్, ఆముదాల వెంకటేష్, చింతంశెట్టి మధు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంతో సౌకర్యంగా బస్సు

### -విద్యుత్‌బస్సులో ప్రయాణించి ఆనందం

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:



యాత్రికుల సౌకర్యార్థం తిరుమలలో నడిచేందుకు విద్యుత్ బస్సును, మరో 15ట్యాబ్‌లను నీరారాడియా 1.13 కోట్ల విలువైన విద్యుత్ బస్సు విరాళమిచ్చారు. బస్సుతో బాటు మరో 20లక్షలు విలువైన 15 ట్యాబ్‌లు అందజేశారు. తిరుమలలో భక్తుల కోసం నడుపుతున్న ఉచిత ధర్మరథం సేవలోఈ కొత్త బస్సురావడంతో మరింత సౌకర్యవంతంగా ఉంటుందని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ఛైర్మన్, అదనపు ఈఓ దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని అభినందించారు.

## అంకితభావంతో మరిన్ని సేవలు

### -డిఎస్పీ సాయిగిరధర్‌కు ఎస్పీల అభినందన

తిరుపతి,మే 30ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా టాస్క్ ఫోర్స్ డిఎస్పీ బి.సాయిగిరిధర్ పదోన్నతితో మరింత అంకితభావంతో సేవలందించాలని ఎస్పీలు పేర్కొన్నారు. సాయి గిరిధర్ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ లో రిజర్వు ఇనస్పెక్టర్ (ఆర్ఐ)గా ఇప్పటివరకు సమర్థవంతమైన సేవలందించారు. డీఎస్పీ గా పదోన్నతి రావడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్ ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడుని ,టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ని మర్యాద పూర్వకంగాకలిశారు.

## ఆదివాసీ సామూహిక వివాహోత్సవాల్లో ప్రతాప్‌స్వామి



తిరుపతి,మే 30ప్రభాతవార్త:

పోలవరంజిల్లా రాజవొమ్మంగిలో జరి గిన ఆదివాసీల సామూహిక వివా హోత్సవ వేడుకల్లో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి పాల్గొన్నారు. దానధర్మచారిట బుల్‌ట్రస్ట్, వికాసతరంగాణి సంయుక్తంగా చేపట్టిన సామూహిక వివాహ వేడుకల్లో చిన్నజీయర్‌స్వామితో ప్రతాప్‌స్వామి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

## సైకో జగన్ మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు

### -తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద గౌడ్

తిరుపతి,మే 30ప్రభాతవార్త:



సచివాలయ ఉద్యోగాలు తన ప్రభుత్వంలో అమ్ముకున్నట్లే అందరూ ఉద్యోగాలు అమ్ముకుంటారని మాజీ సిఎం జగన్ అనుకోవడం అతని అవివేకానికి నిదర్శనమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద గౌడ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో అవినీతికి తావే లేదన్నారు. తన హయంలో ఒక్క డీఎస్సీ కూడా వెయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర జగన్ ది. జగన్ తీరుపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ వెయ్యని మోసకారి జగన్... తన ఐదేళ్ల పాలనలో ఇటు నోటిఫికేషన్లు వేయక, అటు కంపెనీలను తరిమికొట్టి నిరుద్యోగులను నిలువునా ముంచేసిన దుర్మార్గుడు జగన్ అన్నాడు. కూటమి ప్రభుత్వంలో మెగా డీఎస్సీ లో 16వేల ఉద్యోగాల భర్తీ చేసి, జాబ్ క్యాలెండర్ వేయడం జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలతో నిరుద్యోగుల్లో అపోహలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. రాత్రి, పగలు కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన 16 వేల మంది కష్టాన్ని అవమానించడం జగన్ పిచ్చికి పరాకాష్ట అన్నారు. అందరూ తనలాంటి వారే అనుకోవడం అతని నైజం అన్నారు. జగన్ ఎంత ఏడ్చినా కూటమి ప్రభుత్వం మరలా డీఎస్సీ వేయడం, జాబ్ క్యాలెండర్ అమలు చేయడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం గ్యారంటీ అన్నారు.

## విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు

### -డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు

తిరుపతి, మే 30 ప్రభాతవార్త:



కొన్ని జిల్లాల్లో బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి శనివారం తెలిపారు. బలమైన గాలి, వర్షం కురు స్తున్న నేపథ్యంలో ఏపిఎస్పిడిసిఎల్ అధికారులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ఒక్కో జిల్లాకు చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు తెలిపారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ ప్రాంత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నంబరుకు గానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు: 1912 ,1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సిఎండి శివశంకర్ సూచించారు.

# తిరుపతి డివిజన్

## మానసిక నైపుణ్యానికి...చదరంగం

### శిక్షణ ముగింపు సమావేశంలో పలువురు వక్తలు




శ్రీకాళహస్తి,మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని సరస్వతి శిశుమందిర్‌లో పది రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ శనివారం ముగిసింది. ఈ కోచింగ్‌ను చిల్డ్రన్స్ చెస్అసోసియేషన్ సారధ్యంలో నిర్వహించారు. సుమారు25 సంవత్సరాలుగా ఇక్కడ అసోసియేషన్ సారధ్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది సుమారు వంద మంది చిన్నారులకు చదరంగంపై మక్కువ కల్పిస్తున్నారు. శనివారం ముగింపు సందర్బంగా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయసారధి, కెనరా బ్యాంకు మేనేజర్ త్రివేణి, సోషల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపల్ లలితమ్మ,రాగూర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్యదర్శి కెఎస్‌బి సూర్యప్రకాష్ నివేదికను అందించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ పాతికేళ్లుగా పిల్లల్లో మానసిక నైపుణ్యాన్ని పెంపొందిం చుటకు క్రీడలపై మక్కువ పెంచటానికి ప్రత్యేంగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. చదరంగం సాధన చేసే టప్పుడు, అలాగే పోటీల్లో పాల్గొన్నపుడు మెదడు రెండువైపులా పని చేస్తుందని డాక్టర్ లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కార్యక్రమాల్లో సంఘానికి చెందిన అధ్యక్షులు ఎం.వి శ్యాం ప్రసాద్, ఆర్గనైజర్ సురేష్‌బాబు,కార్యదర్శి సూర్యప్రకాష్, కోశాధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెత్తసేకరణకు ప్లాస్టిక్ బుట్టల పంపిణీ

శాంతిపురం, మే 30 ప్రభాతవార్త: మండలంలోని కర్ల గట్ట పంచాయతీ వెంకటాపురం గ్రామంలో శనివారం ప్రజల ఇళ్ళ నుంచి చెత్త సేకరణకు గాను ప్లాస్టిక్ బుట్టలను తెదేపా నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గిరి, చంద్ర, రుద్రప్ప, మురుగేష్ ,యూత్ లీడర్ సంతోష్, రామస్వామి, మల్లేష్ ,జ్యోతి ,దేవి, వెంకటేష్, మంజుల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ కంపెనీకే...అధిక ముగ్గురాయి సరఫరా!



ఓబులవారిపల్లి, 30 మే ప్రభాత వార్త: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట ఏపీ ఎంబీసీ సంస్థలో ఉత్పత్తి అవుతున్న ఏ గ్రేడ్ ఖనిజం అలాగే బి గ్రేడ్ కనీసం మరియు సీఎండి ఖనిజాలు ఏ ప్రభుత్వాలు మారిన అటు వైసిపి అయినా ఇటు తెలుగుదేశం అయినా కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ ఒక ఎక్స్పోర్ట్ కంపెనీకి అధికంగా ముగ్గు రాయి సరఫరా చేయడం దక్కించుకున్నట్లు తెలుస్తుంది. దీని వెనుక రాష్ట్ర నాయకులు మరియు ఉన్నత అధికారులు ఏపీఎండిసి సంస్థకు చెందిన వారు హస్తం ఉన్నట్లు మంగంపేటలో ప్రజలు పలువురు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఎంబీసీ సమస్త 60 లక్షలు టన్నుల ముగ్గురాయిని వెలికి తీసినట్లు సమాచారం. టెండర్లకు పిలిచి ప్రస్తుతం ఒక టన్ను 2100 రూపాయలు ఉన్నప్పటికీ, ఆ ఎక్స్పోర్ట్ కంపెనీకి 1600 రూపాయలకే టన్ను టెండర్లు దక్కించుకోవడం వెనుక పలు అనుమానాలు వినవస్తున్నాయి. అంతేకాకుండా ప్రస్తుతం బయ్యర్లకు, స్థానిక మిల్లర్లకు రు.2100 చొప్పున టన్ను ధర డివో కడితే కానీ, ఏపీఎండిసి అధికారులు మిల్లర్లకు సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మొత్తంలో 60 లక్షలు తన్నులు సిఎండి ముగ్గురాయి, ఒకే కంపెనీకి టెండర్ల ద్వారా ఎలా దక్కించడం విమర్శలను తాయిస్తున్నదని అంటున్నారు. ఆర్థిక విశ్లేషకులు కూడా ఒకే ఎక్స్పోర్ట్ కంపెనీకి ఏపీఎండిసి అధికారులు ఎందుకు సహకరిస్తున్నారని, ఏపీ ఎంబీసీకి ఆ ఎక్స్పోర్ట్ కంపెనీపై ఎందుకు అంత ప్రేమ అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పలువురు కార్మిక నాయకులు ఆర్థిక విశ్లేషకులు స్థానిక నాయకులు విమర్శిస్తున్నారు. ఆ కంపెనీ వల్ల లబ్ది పొందే వారి స్వలాభాల కోసం ఇలా మాట్లాడుతున్నారని పలువురు ఆరోపించారు. ఏది ఏమైనా మంగంపేటలో ముగ్గురాయి కొంతమందికే అనే విధంగా వుందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు నాయకులు పునరాలోచించి మంగంపేటలో ముగ్గురాయిని నమ్ముకుని జీవిస్తున్న యజమానులు కూడా సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరుతున్నారు.


## ప్రభుత్వ బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే



సత్యవేడు, మే 30 ప్రభాత వార్త: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాల్సిన అవసరం ఉందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి రవి ఆధ్వర్యంలో బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, దుస్తులు, మధ్యాహ్నం భోజనం పథకం అమలుచేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. అందువల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పని చేస్తున్న గ్రామాలల్లో నేరుగా ఇళ్ళ వద్దకు వెళ్లి బడిఈడు పిల్లల తల్లిదండ్రులను కలసి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. తదనంతరం ఈఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్ష 9 హైస్కూలు, రెండు గురుకుల పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 45 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారి కలసి శాలువ కప్పి పూలమాలతో సత్కరించి మెడల్స్ అందించారు. అనంతరం బడి పిలుస్తోంది ప్రచార రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బాలుర గురుకుల ప్రధానోపాధ్యాయులు నారాయణస్వామి, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు, రెవెన్యూ డీటీ వెంకటేశ్వర్, ఎంఈవో ఉష, మదనంబేడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విమల, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో కొనసాగుతున్న వేసవి రద్దీ

### -దర్శనానికి నాలుగు గంటల సమయం



కాణిపాకం, మే 30 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధివినాయక స్వామి అలయంలో శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయంలో రోజు రోజుకూ భక్తుల రద్దీ పెరుగుతుండడంతో కాణిపాకం ఆలయ భక్తజన సంద్రంగా తయారైంది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈ మేరకు శనివారం వారంతపు రోజు కావడంతో పాటు విద్యాసంస్థలు,పాఠశాలలకు వేసవి సెలవులు మరో వారం రోజుల్లో ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, తాగునీరు అందించారు.

# పౌర్ణమి పూజలకు...కదలి వచ్చిన భక్త జనం




శ్రీకాళహస్తి, మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. శనివారం పౌర్ణమి,సుబ్రమణ్యం స్వామి జన్మదినంతో తమిళనాడు నుంచి భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. దాంతో వచ్చిన భక్తుల సౌకర్యార్థం అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సిపార్సులు, దళారులతో సామాన్య భక్తులకు సంకటం తప్పలేదు. గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో నిరీక్షిం చాల్సి వచ్చింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివ నామస్మరణతో పునీతమైంది. అంతేకాక ముక్కోటి దేవతలకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరా లయంలో స్వామి అమ్మవార్ల దర్శ నానికి భక్తులు నిరీక్షించారు. కాగా స్వామి దర్శనం తరువాత అభయ వెంకటేశ్వరునికి నిర్వాహకులు ఆభరణాలతో విశేష అలంకారాలు జరిపారు. రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించు కుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేసవి సెలవుల ప్రభావతం కనబడుతుంది. శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

**శివానందైక నిలయం జనంతో కిట కిట:**

శివానందైక నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయు లింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిథుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ బికె వెంకటేశ్వర్లు ఆదేశాలతో వారి సిబ్బంది పరుగులు తీసారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. ఏ లాడ్జిలో చూసినా ఏ హోటల్‌లో పరిశీలించినా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చూసినా జనమే జనం. ఈ నేపధ్యంలో తమిళనాడు, కర్నాటకల సరిహద్దుల్లో ఉన్న 'దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శనివారం భక్త జనంతో కిటకిట లాడింది. కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు సమీపంలోని శాంతి సౌఖ్యాల్ని అందించే ముక్కంటీశుని దర్శనానికి తరలి వస్తున్నారు. తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం కావటంతో సమీపంలోని ముక్కంటీశుని దర్శనానికి విచ్చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం, పర్యవేక్షకులు నాగభూణం యాదవ్ వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## 2న గురుపేర్చి



శ్రీకాళహస్తి,మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాయంలో వెలసిన గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద జూన్ 2న గురుపేర్చి పూజలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారి బికె వెంకటేశులు శనివారం తెలిపారు. గురుగ్రహం రాశి మారే సమయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి అని వివరించారు. ఈ నేపధ్యంలో మంగళవారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద నవగ్రహాల్లో పంచమ గ్రహమైన శ్రీ గురు గ్రహం మిధున రాశినుంచి కర్కాటక రాశి లోనికి ప్రవేశించు సందర్భంగా అష్టోత్తర (108) శత శంఖాభిషేకం నిర్వహించుటకు శుభ నిర్ణయంగా నిర్ణయించినట్లు ఇఓ వెంకటేశులు తెలిపారు. జూన్ 1 రాత్రి కలశస్థాపన నిర్వహించ బడుతుందన్నారు. 2వ తేది మంగళవారం ఉదయం సంకల్పం, అష్టోత్తర శత శంఖాభిషేకం నైవేద్యం దీపారాధన, ప్రత్యేకాలంకారం నిర్వహించబడుతుందన్నారు. సాయంత్రం గురుద క్షిణామూర్తికి ప్రత్యేంగా చందనాలంకారం నిర్వహిస్తామన్నారు. రాత్రి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.

## శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు



శ్రీకాళహస్తి, మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయం శనివారం శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనివారం పౌర్ణమి, సుబ్రమణ్యం శ్రేష్టి కావటంతో శనీశ్వరుని ఆలయం వద్ద, అభయ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆలయ కార్యనిర్వహాణాధికారి బికె వెంకటేశులు ప్రత్యేకంగా వ్యక్తిగతంగా పర్యవేక్షించారు.

## వైభవంగా సుబ్రమణేశ్వరస్వామి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి,మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శనివారం పౌర్ణమి, సుబ్రమణ్యం స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రంగుల గోపురం పక్కనే వెలసిన వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి అలాగే మూకతీర్థం ఎదుట వెలసిన చంగల్వరాయస్వామి, శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంతో పాటు తేరువీధిలో వెలసినషణ్ముఖ స్వామి ఆలయంలో విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. తేరువీదిలోని షణ్ముఖునికి చాక్‌లెట్లతో ప్రత్యేకాలంకారం చేశారు. అర్చకులు మాట్లాడుతూ సుబ్రమణ్యం స్వామి జన్మదినం విశేషమైన రోజు అన్నారు. భక్తులు హరోం హర నామస్మరణ చేస్తూ దర్శించుకున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌ఎంకే పరశురామ గురుకుల్(అచ్చుత స్వామి) ప్రసాద్ స్వామి, యామిని, దిలీప్ కుమార్, సుప్రియ,లక్ష్మమ్మ,సురేష్,తంగిరాలస్వామి సేవకులు పాల్గొన్నారు.

## జలధారతో తాటిపర్తి చెరువుకు మహార్ధశ

### -కోటి 18 లక్షలతో ఉపాధి హామీ పనులు



తొట్టంబేడు మే 30 ప్రభాతవార్త: జలధార జలహారతి పథకం తొట్టంబేడు మండలం తాటిపర్తి గ్రామపంచాయతీ చెరువుకు ఓ వరంగా మారింది. ఎంతో కాలంగా నిధుల కొరతతో తల్లడిల్లుతున్న ఇరిగేషన్ కు ఇదే చక్కటి అవకాశంగా లభించింది. ప్రభుత్వం వినూత్న రీతిలో ఈ పథకాన్ని అమలుకు ఆదేశించింది. ఎంతో కాలంగా మరమ్మత్తులకు నోచుకొని పంట కాలువలు, చెరువులు బాగు చేసుకోనుటకు మహదశకాశం వచ్చింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో ఈ అవకాశాన్ని నాయకులుసద్వినియోగం చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాసుల్లేక తల్లడిల్లిన వ్యవసాయ వనరులకు ప్రస్తుతం ఓ చక్కటి అవకాశం లభించింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులను చేపడుతున్నట్లు ఎంపీడీవో పి. సురేంద్రనాథ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కోటి 18 లక్షలు రూపాయలు విలువైన పనులకు ప్రభుత్వ అనుమతి ఇచ్చింది అన్నారు. ఈ ఉపాధి హామీ ఎన్ఆర్ఈజీఎస్ కింద జరుగుతాయన్నారు. దీనివలన నీటి సమస్య తీరుతుందని, చెరువులో కుంటలు బాగు చేస్తే వర్షపు నీరు నిల్వ ఉండి బోర్లు బావులు నీళ్ల పెరగతాయన్నారు. ఆయనతోపాటు ఏపీవో కళ్యాణి టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

## జనసైనికులచే మంచినీటి బావి ఏర్పాటు



శ్రీకాళహస్తి,మే 30 ప్రభాతవార్త: పార్టీ పరంగానే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా జనసైనికులు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలను ఆచరిస్తూ జనంలో గుర్తింపు సాధిస్తున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తికి చెందిన జనసైనికులు సామాజిక సేవల్లో కూడా భాగస్వాము లౌతున్నారు. ఈనేపధ్యంలో శ్రీకాళహస్తికి సమీపంలోని శ్రీనివాస పురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద మంచినీటి ఎద్దడి చోటు చేసుకుందని ఆ ప్రాంతానికి చెందిన యువకులు పార్టీ దృష్టికి తెచ్చారు. దాంతో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ద్వారా తాటిపర్తి అనిల్‌రెడ్డి తన సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు చేసి భక్తులకు మంచినీటి కొరతను తీర్చారు. ఈ కార్యక్రమాలను తన స్నేహితులు మధు,టిఆర్‌బాలాజి, తాటిపర్తి అనిల్‌రెడ్డి ఆర్థిక సహాయంతో చేపట్టినట్లు కొట్టెసాయి ప్రసాద్ వివరించారు. జనసైనికుల చొరవను అభినందిస్తూ సర్పంచ్ సురేష్, గ్రామానికి చెందిన బాబు,రాకెట్ రామయ్య,దేవరాజులు దన్యవాదాలు తెలిపారు. చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌ను ఆలయం తరపున సత్కరించారు.

## రేపటి నుండి అందుబాటులో యూరియా



తొట్టంబేడు,మే 30 ప్రభాతవార్త: మండలంలోని తంగేళ్ళ పాళెం సింగిల్ విండోలో జూన్ 1 సోమవారం నుంచియూరియా అందుబాటులో ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు బీమాల భాస్కర్ ముదిరాజ్ శనివారం మీడియా సమావేశంలో వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. రైతులకు ఏ సీజన్‌లో ఏదీ అవసరమో ముందుగానే గుర్తించి అందుబాటులో ఉంచుతున్నారని ఆయన వివరించారు. ఈనేపధ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి ప్రాధాన్యత ఉంది కాబట్టి ఎప్పటికప్పుడు శాసనసభ్యులు సుదీర్‌రెడ్డి వ్యవసాయాధికారులతో సమావేశం జరుపుతూ రైతులకు సదుపాయాలు కల్పిస్తున్నారని వివరించారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సకాలంలో అందించుటకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకకుందన్నారు. అయితే రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని భాస్కర్ సూచించారు.

## పానగల్ జాతరకు సన్నాహాలు

శ్రీకాళహస్తి,మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పానగల్ జాతరకు సన్నాహాలు చేస్తున్నారు. వేసవి కాలంలో తిరుపతి జాతర తరువాత పానగల్‌జాతరనునిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో యువ కమిటి జాతర నిర్వహాణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది గతం కన్నా ఘనంగా జాతరనునిర్వహించుటకు చర్యలుతీసుకకుంటున్నారు. గంగమ్మ జాతర చాటింపుకుసన్నాహాలు చేస్తున్నారు. జూన్ రెండు మంగళవారం చాటింపు నిర్వహిస్తామన్నారు. జూన్9న గంగమ్మనిలుపుదల, 10న గంగమ్మ నిమజ్జనం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటి ప్రకటించింది. జాతరనుభారీ ఎత్తున నిర్వహించటం ఆనవాయితి. ఇందుకు ఏర్పాట్లులో యువకులు నిమగ్నమయ్యారు.

## మహానాడుకు ఎంఎల్‌ఏ రూ.15లక్షల విరాళం

శ్రీకాళహస్తి,మే 30 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఎంఎల్ఏలే,ఎంపిలు, పార్టీకార్యకర్తలు విరివిగా విరాళాలను అందించారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తన వంతుగా రూ.15లక్షలు పార్టీ విరాళంగా అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

## పెయిన్ క్లినిక్ క్యాంప్ విజయవంతం



శ్రీకాళహస్తి,మే 30ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో శనివారం పెయిన్ క్లీనిక్ క్యాంప్‌ను డాక్టర్ రవికృష్ణ కళత్తూరు నిర్వహించారు. ఈ క్లీనిక్‌ను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పర్యవేక్షించారు. స్థానిక శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి చెన్నై అపోలో అసుపత్రి నిర్వాహుకులతో చర్చించారు. శ్రీకాళహస్తి ఆసుపత్రిని 90 రోజుల్లో రూపురేఖలు మారిపోతాయని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి వివరించారు. ఈ క్యాంప్‌లో 60మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

## ఈదురు గాలులతో రైతులకు పంటలు నష్టం



రామకుప్పం, మే 30 ప్రభాతవార్త: మండలంలో వర్షంతో పాటు ఈదురు గాలులు వేగానికి రైతుల పండిస్తున్న పంటలకు అపార నష్టం కలిగించింది. శనివారం సాయంత్రం మండలంలోని బూరుమాకుల పల్లి చల్దిగానిపల్లి, రాజుపేట, భైపరెడ్లపల్లి, కెంపసముద్రం గ్రామాల్లో బీన్స్, దోస, బీరకాయ, మొక్కజొన్న, టమోటా, చిక్కుడు పంటలు నేలవాలాయి. రాజుపేట వద్ద తైలం చెట్లు ఈదురుగాలల తాకిడికి విద్యుత్ తీగలపై పడి స్తంభం విరిగాయి. విద్యుత్ అధికారులు మరమ్మతులకు చేపట్టారు. గంటసేపు మేర విద్యుత్ అంతరాయం కలిగింది.

## మహిళా వైద్యులకు లాప్రోస్కోపి

## - సర్జరీ పై రెండు రోజుల కార్యశాల

తిరుపతి హెల్త్, మే 30, ప్రభాతవార్త



ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో శనివారం లాపరో స్కోపి సర్జరీ వర్క్ షాప్ మే 30వ తేదీ, 31 తేదీ వరకు 2 రోజులు కార్యశాల లాపరోస్కోపీ సర్జరీ వర్క్‌షాప్ మొదటి రోజు విజయవంతం నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, తిరుపతి నందు అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపీ ఇన్ అబ్స్టెట్రిక్స్, గైనకాలజీ అనే అంశంపై మొదటి రోజు వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద తల్లులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా, మన ప్రసూతి ఆసుపత్రి జీఎంహెచ్‌లో లాపరోస్కోపీ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తాం. గాయం చిన్నది ఉపశమనం పెద్దది అనే కీహోల్ సర్జరీతో తల్లులు త్వరగా కోలుకుని, తక్కువ సమయంలో వారు సురక్షితంగా, ఆరోగ్యంగా ఇంటికి వెళ్ళవచ్చును ఈ వర్క్ షాప్ ద్వారా వైద్యుల నైపుణ్యాభి వృద్ధికి దోహధపడటమే కాకుండా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించుటలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ అవకాశం తిరుపతి పట్టణంలో తిరుపతి జిల్లాలోని ప్రజలుకు అందుబాటులో వున్నందుకు, ఈ సేవలు అందించుటకు ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ గారికి అభినందనలు తెలిపారు. వర్క్ షాప్‌లో పాల్గొన్న వైద్యులు వర్క్ షాప్ నిర్వహించడం పై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలాంటి శాస్త్రీయ కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వర్క్ షాప్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అధ్యాపకులు, వైద్యులు, నర్సింగ్, హాస్పిటల్ సిబ్బంది, నిర్వహక కమిటీ సభ్యులకు ఆసుపత్రి యాజమాన్యం కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలోలాపరోస్కోపి సర్జన్స్ డా. అంకుల్ షాగారు, డా. సందీప్ కాక్వాడ్గారు, డా. చింతన్ అరవింద్ పటేల్, మునిస్వామి హెచ్‌డిఎస్ మెంబెర్, రాజా రెడ్డి ప్రెసిడెంట్ సిటీ జెఎస్‌పి, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డా. రామ నారాయణ రెడ్డి, ప్రొఫెసర్స్ డా.రాధ, డా. గాయత్రి, డా. నిర్మలదేవి, డా. మాధవి, అనస్టేషియా డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డా. జీవన్ బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డా. కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ కాలేజీ కోఆర్డినేటర్ డా భువనేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అనస్టేషియ డా.రంగనాథ్ మరియు రవికిరణ్, గైనకాలజి స్ట్ డా. జ్యోస్న, డా ఉమ అకడమిక్ అండ్ కాలేజీ కోఆర్డినేటర్, గైనకాలజిస్ట్స్, డా. బాలాజీ, డా. జయశ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, జూనియర్ డాక్టర్స్, డా నిర్మలమ్మ లెక్చరర్ ఇన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కళావతి నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.